దినేష్ దగ్గరనుంచి రెగ్యులర్‌గా లెటర్స్ వస్తుండటంతో అతన్ని గురించిన బాధలేదు. "అతి త్వరలో ఇండియా వచ్చేస్తానమ్మా. నా రూమ్ బాగా డెకరేట్ చేసి వుంచాలి. నేను సాధ్యమైనంత త్వరలో వచ్చేస్తానమ్మా. నువ్వు బాధపడకు" అంటూ శోభకు ధైర్యం చెబుతూ వ్రాసేవాడు. అవి చదువుకొని దినేష్ వచ్చేసినట్లే సంబరపడిపోయేది శోభాదేవి.

దినేష్ చిన్నపిల్లవాడుగా వున్నప్పటినుంచీ ప్రతి పుట్టిన రోజునాడూ తీసిన ఫొటోలన్నీ ఓ ఆల్బమ్‌లో వుంచారు. పదే పదే అవి చూసుకుంటూ కొడుకు చిలిపి అల్లరి గురించి హర్షతో చెబుతూ హాయిగా నవ్వుతుండేవారు. హర్ష ఏదైనా కొంటె పని చేస్తే దినేష్ కూడా యిలాగే చేసేవాడు' అంటూ అనుక్షణం హర్ష ప్రతి కదలికలో కొడుకు జ్ఞాపకాలను చూసుకుంటూ వుండేది శోభ. హర్షమీద ఆమెకు ఆప్యాయత రోజురోజుకూ పెరుగులోంది.

ఆ రోజు ఏదో స్కూల్ ప్రారంభోత్సవానికి ఆహ్వానం రావడంతో కలెక్టర్‌గారి ఫామిలీతో పాటు అందంగా హుందాగా వాళ్ళ కారులో దిగిన హర్షను చూసి అంతా వారమ్మాయనే అనుకున్నారు. హర్ష ఆ రోజు ఫంక్షన్‌లో కలెక్టర్ రావుగారి చెయ్యి వదిలిపెట్టలేదు. ఓ ప్రక్క శోభాదేవీ మరో ప్రక్క హర్షా కూర్చున్నారు. తను కలెక్టర్‌గారికి సన్నిహితురాలినని వాళ్ళందరూ అనుకోవాలని తనని గొప్పగా గౌరవించాలనీ హర్ష కోరిక.

హర్ష కోరుకున్నట్లుగానే కలెక్టర్‌గారి చెయ్యి విడువకుండా తిరిగే ఈ అందాల అపరంజి బొమ్మ నిశ్చయంగా కలెక్టర్‌గారికి అత్యంత ఆప్తురాలే అయ్యుంటుందని హర్షకు వి. ఐ. పి. ట్రీట్‌మెంట్ యిచ్చి చాలా గౌరవంగా చూశారు. ఆ రోజు హర్ష మనసు ఆనందంతో గంతులు వేసింది. ఇన్నాళ్ళుగా తనకు లేని గుర్తింపూ, ఓ ప్రత్యేకతా చూపించే మనుషుల మధ్య మసలుతుంటే జీవితం నందనవనంలా కనిపించింది.

అయితే, రావుగారు హర్ష పట్ల అభిమానంగానే వున్నా ఈ మధ్య ఆపిల్ల పదేపదే వచ్చి తమ ఏకాంతానికి భంగం కలిగించడం అంత యిష్టముండేది కాదు. పెళ్ళైన రోజునుంచీ శోభ లేకుండా ఒంటరిగా భోంచేయడంగానీ, ఒంటరిగా ఒక్క నిముషమైనా యింట్లో గడపటంగానీ ఏవిటో అసహజంగా అనిపిస్తుండేది. అలాంటిది హర్ష మూలంగా ఎక్కువ భాగం హర్షతో గడిచిపోతుంటే శోభాదేవితో ఒంటరిగా మాట్లాడే ఆనందానికి దూరమవుతున్నానన్న బాధ లోలోన ఆయనకు అసంతృప్తిని కలిగిస్తుండేది.

అయినా హర్ష సమక్షంలో అవేవీ గుర్తు వుండేవి కావు. కాలానికి కళ్ళాలు లేనట్లుగా అతి వేగంగా నిముషాలూ, గంటలూ గడిచిపోయేవి. ఆ అమ్మాయి వెళ్ళిపోయింతర్వాతగానీ, తను రోజురోజుకూ శోభకు చాలా దూరమవుతున్నానన్న భావన కలగటంలేదు. మరు రోజు హర్ష రాగానే అన్నీ మరిచిపోయేవారు; ఆప్యాయంగా పలకరించేవారు. అభిమానంగా ఆఫీసు నుంచి వస్తూ తెచ్చిన స్వీట్స్, పూలూ అందించేవారు.

పెద్దకథ:

2 తెలిసి చేసిన పాపం

"మరో మూడు వారాల్లో వచ్చేస్తున్నానమ్మా! మీ ముందు వాలిపోతాను. డాడీ, నువ్వూ నన్ను ఎలా రిసీవ్ చేసుకోవాలా ఎంత గ్రాండ్‌గా స్వాగతం చెప్పాలా అని చూస్తున్నారు కదూ! వచ్చేరోజు డిసైడ్ అయిన దగ్గరనుంచీ నాకూ అలాగే ఆత్రంగా వుందమ్మా! ఎప్పుడెప్పుడు వచ్చి మిమ్మల్ని చూస్తానా అనిపిస్తోంది. మీ హర్షను కూడా ఎయిర్‌పోర్ట్‌కు తీసుకురండి. నువ్వంతగా వర్ణిస్తూ వ్రాసే మీ హర్షను చూడాలని మరీ కోరికగా వుంది. హర్ష పరిచయమైన తర్వాత నా గురించిన దిగులు కూడా మీకు లేకుండా చేసిన తనకు కృతజ్ఞతలు చెప్పాలి మొదట." అంటూ దినేష్ వ్రాసిన లెటర్ చూసి శోభాదేవి ఆనందంతో పొంగిపోయింది. కొడుకు వచ్చేసరికి యిల్లు అద్దంలా కనిపించాలని సామానులన్నీ చక్కగా సర్దించడం, దినేష్‌కు యిష్టమైన పిండివంటలన్నీ వంట మనిషి చేత వండించడంలాంటి పనుల్లో పడిపోయింది. ఆ ఆనందంలో హర్ష, రావుగారు కూడా పాలుపంచుకున్నారు. సాయంత్రాలు ముగ్గురూ కలసి దినేష్ రాగానే ముందుగా కన్నుల పండువగా కనిపించే గార్డెన్ చూసి మురిసిపోతాడని దగ్గరుండి మాలి చేత అడ్డదిడ్డంగా పెరిగిన మొక్కల్ని చక్కగా కత్తిరించడం, విడవకుండా లాన్‌లో నీళ్ళు చల్లించడంలాంటి పనులు చేయిస్తుండేవారు.

ఆ రోజు దినేష్ రూమ్ స్వయంగా తనే సర్దాలని దగ్గరుండి కడిగిస్తూ సర్దుతూ వుంది శోభాదేవి. తోటలో హర్ష, రావుగారు ప్రతి చెట్టు దగ్గరా ఆగి ఏ కొమ్మలు అడ్డదిడ్డంగా పెరిగాయో చూసి కత్తిరిస్తున్నారు కబుర్లు చెప్పుకుంటూ.

మొసాయిక్ ఫ్లోరింగ్ మీద సబ్బునీళ్ళతో శుభ్రంగా తుడుస్తోంది మాలక్ష్మి. దినేష్ వీణ దులిపి, ప్రక్కకు సర్ది, పుస్తకాల బీరువా వైపు అడుగులువేసిన శోభాదేవి కాలు స్లిప్‌కావడంతో క్రిందపడి కెవ్వున కేకపెట్టారు. ఆ కేకకు మాలక్ష్మి అదిరిపోయింది. క్రింద తోటలో నవ్వుతూ కబుర్లు చెప్పుకుంటున్న రావుగారూ హర్షా పరుగెత్తుకొని పైకి వచ్చారు.

ఫామిలీ డాక్టర్ శ్రీనివాసరావుగారు దగ్గరుండి శోభాదేవికి ఎక్స్‌రే తీయించారు. మోకాలు దగ్గర ఫ్రాక్చరైంది. మరురోజు ప్రొద్దుటగానీ ప్లాస్టర్ వేయడానికి వీలు లేదని అప్పటికి కట్టుకట్టి ఇంజక్షనిచ్చి ఏవో కొన్ని టాబ్లెట్స్ యిచ్చి జాగ్రత్తగా చూడమని చెప్పి వెళ్ళారు. హర్ష కళ్ళు అవిరామంగా వర్షిస్తున్నాయి. నిస్సహాయంగా మంచంలో పడిపోయిన శోభాదేవిని చూస్తే మనసు భారమైపోతోంది రావుగారికి. హర్ష ఎదురుగా వున్నదన్న విషయం కూడా మరచి శోభాదేవి ముఖం రెండు చేతుల మధ్యకు తీసుకొని హృదయానికి హత్తుకున్నారు. ఇద్దరి కళ్ళూ నీళ్ళతో నిండిపోయాయి. దినేష్ వస్తున్నాడన్న ఆనందం ఎగిరిపోయింది. పసిపిల్లవాడిలా బాధపడుతున్న రావుగారిని చూస్తే హర్ష మనసు కరిగి నీరైంది. అంత పెద్ద మనిషి అలా కన్నీరు కారుస్తుంటే ఏం చేయాలో తోచలేదు. మాలక్ష్మి పిలుపుతో

నెమ్మదిగా వెనుదిరిగి క్రిందకు వెళ్ళిపోయింది వాళ్ళిద్దరినీ ఒంటరిగా వదిలి.

మరురోజు పాదం దగ్గర నుంచీ మోకాలివరకూ ప్లాస్టర్‌తో దినేష్ గదిలో పైకప్పువేపు చూస్తూ పడుకుని వున్న శోభాదేవి_అడుగుల చప్పుడుకు తల తిప్పి హర్షను చూసి చిన్నగా నవ్వుతూ పిలిచింది.

"రామ్మా ! హర్షా ! రాత్రి చెప్పకుండానే వెళ్లిపోయావేం ? మీ నాన్నగారు లేట్‌గా వస్తారన్నావు. ఒక్కదానివీ ఎలా వున్నావు ? మీ అంకుల్ పసిపిల్లాడిలా ఏడుస్తుంటే ఆయన్ని ఓదార్చే ప్రయత్నంలో నేనూ ఏడుస్తూ వుండిపోయాను. ఆ తర్వాత మా లక్ష్మి నడిగితే నువ్వు వెళ్ళిపోయినట్లు చెప్పింది. రా కూర్చో" అంటూ చెయ్యి అందించిన శోభాదేవి చేయి తన చేతుల్లోకి తీసుకొని క్రిందనే చతికిలబడిన హర్ష ఆ చేయి పట్టుకొని ఏడ్చేసింది.

"ఆంటీ ! ఎంతో సంతోషంగా అన్నీ అందంగా అమర్చాలని ఆరాటపడిన మీరు యిలా మంచం మీద పడివుండడం" అంటూ కన్నీరు కారుస్తున్న హర్ష పాలగ్లాసుతో మంచం దగ్గరకు వచ్చిన రావు గారిని చూసి ఆశ్చర్యపోయింది.

ఒక్క రాత్రిలో ఆయనలో వచ్చిన మార్పు హర్షను కలవరపెట్టింది. అందంగా డ్రెస్ చేసుకొని ఠీవిగా నడిచే రావుగారు _ కలెక్టర్ పదవికే ఓ అందాన్నిచ్చే రావుగారు_పీక్కుపోయిన ముఖంతో నలిగిపోయిన బట్టలతో, చెదరిపోయిన క్రాపుతో

నీరసంగా అడుగులేస్తూ పాలగ్లాసు తీసుకుని వచ్చి, హర్షను చూసి చిన్నగా నవ్వడానికి ప్రయత్నిస్తూ గ్లాసు టీ పాయ్ మీద పెట్టి మంచంమీద ఓ ప్రక్కగా కూర్చున్నారు. "క్రింద కూర్చున్నావేం హర్షా ! అలా కుర్చీలో కూర్చో" అంటూ "లే శోభా ! కొంచం పాలు త్రాగి పడుకో" అంటూ నెమ్మదిగా దిండ్లు రెండు ఎత్తుగా వేసి కూర్చోబెట్టారు.

రావుగారినే చూస్తూ నెమ్మదిగా లేచినుంచున్న హర్షవైపు చూసి నవ్వుతూ_

"చూశావా హర్షా ! మీ అంకుల్ ఎంత ధైర్యశాలో. నా కాలు ఫ్రాక్చరైందంటే ఆయన ప్రాణాలు విలవిల్లాడిపోతున్నాయి. ఇంట్లో ఇందరు నౌకర్లుంటే తనే స్వయంగా పాలు తీసుకొచ్చి నాకివ్వాలా ? ఆఫీసు కూడా ఎగ్గొట్టారు. ఎంతో ఠీవిగా కనిపించే అంకుల్ ఏమిటి యిలా అయ్యారని ఆశ్చర్యపడుతున్నావు కదూ !" అంది శోభాదేవి చిన్నగా నవ్వుతూ రావుగారి వైపు ప్రేమగా చూస్తూ. ఆ కళ్ళలో ప్రేమ ఆరాధనలతో పాటు ఓ సన్నని గర్వరేఖ కూడా తొంగి చూసింది.

"హర్షా ! ఇంటినిండా ఎంతమంది నౌకర్లున్నా తనే నాకు అన్నీ ఎందుకందిస్తుందో కనుక్కో ! ఇన్ని సంవత్సరాలు భగవంతుడు ఆ అవకాశం నాకిచ్చాడు. నేను స్వయంగా పాలు తీసుకొస్తే, ఎందుకంత బాధో మీ ఆంటీకి కనుక్కో. ఒక్క రోజు నేను ఆఫీసుకెళ్ళకపోతే కొంపలంటుకు పోతాయా !" అన్నారు రావుగారు చిరుకోపం

ప్రదర్శిస్తూ – శోభవైపే కన్నార్పకుండా చూస్తూ పాలగ్లాసు నోటికందిస్తూ. గ్లాసు చేతుల్లోకి తీసుకున్న శోభాదేవి కనురెప్పలు సిగ్గుగా వాలిపోయాయి.

కాలు ఫ్రాక్చరై పడుకున్న తనకు పాలగ్లాసు తెచ్చి అందిస్తున్న రావుగారిలో ఏ మార్పూలేదు. తమ యింట్లో బీద విద్యార్థిగా ప్రవేశించి క్రమంగా తన మనసుదోచుకొని తన ఆరాధ్యదైవంగా మారి, తనని ఆరాధించే రావుగారి ప్రేమ, మళ్ళీ అంత సన్నిహితంగా పాలందిస్తున్న ఆ చేయి చూస్తుంటే అతివేగంగా ఇరవై సంవత్సరాల వెనక్కు పరుగులు తీసింది శోభాదేవి మనసు.

గత మధుర స్మృతుల వొరవడిలో పడి కొట్టుకుపోతున్న శోభాదేవి రావుగారూ - హర్ష అక్కడి నుంచీ ఎప్పుడు వెళ్ళిపోయిందో గమనించలేదు.

ఎంతోసేపటికి స్పృహలోకి వచ్చి తిరిగి చూస్తే హర్ష కనిపించలేదు. సిగ్గుగా తల తిప్పుకుంటున్న శోభాదేవి నుదుట ముద్దుపెట్టుకుంటూ –

"శోభా! భగవంతుడికి పక్షపాతం లేదు. ఇన్ని సంవత్సరాలూ ప్రతి నిముషం నా అవసరాలేమిటో కనుక్కుంటూ అమర్చిపెట్టే అవకాశం నీకు కల్పించాడు. ఇప్పుడు నాకా అదృష్టాన్ని ప్రసాదించాడు. అయితే ఇలా కాకుండా మరోలా అయితే ఇంత బాధలేకపోను. నువ్వు అలా కదలకుండా పడి వుంటే నాకు యింట్లో కాళ్ళూ చేతులూ ఆడటం లేదు. ఏమీ తోచడం లేదు. అదీ దినేష్ వచ్చే ముందు నువ్విలా మంచంలో పడి వుంటే...."

రావుగారి కంఠం గద్గదమైంది. టప్పు టప్పున రాలుతున్న కన్నీళ్ళను చూసి కంగారుపడిన శోభాదేవి - ఆయన కళ్ళు తుడుస్తూ "ఛా! ఏమిటండీ యిది చిన్నపిల్లల్లా! నాకేమైంది? మరో మూడు వారాల్లో కట్టు విప్పవచ్చని చెప్పారు డాక్టర్. సింపుల్ ఫ్రాక్చర్. ఆ తర్వాత మామూలుగా తిరుగుతాను. దినేష్ వచ్చే నాటికి ఇల్లంతా యిలాగే వుండిపోతుందే అనే నా బాధ. ఇంకా సర్దించాల్సినవి వున్నాయి."

"మరేం ఫర్వాలేదు హర్షతో చెబితే అన్నీ చూసుకుంటుంది. నువ్వు దిగులుపడకు శోభా!"

"అవును, హర్షా మీరూ వుండగా నాకెందుకు దిగులు? ముందు మీరెళ్ళి స్నానంచేసి, ఆఫీసు కెళ్ళండి." అంటూ హడావుడి పెట్టింది శోభాదేవి. అయిష్టంగానే లేచారు రావుగారు.

రావుగారు క్రిందకి వెళ్ళగానే హాల్లో కూర్చొని పేపర్ తిరగేస్తున్న హర్ష గబగబా పైకి వెళ్ళిపోయింది.

"పాపం! అల్లరిగా గంతులువేసే హర్ష కూడా గంభీరంగా మారిపోయింది ఈరోజు" అనుకుంటూ బాత్‌రూమ్ వైపు అడుగులు వేశారు రావుగారు.

పైకి చేరుకున్న హర్షను ప్రక్కలో కూర్చోబెట్టుకొని "హర్షా నాకేం ఫర్వాలేదు. దినేష్ వచ్చే టప్పటికి నేను లేచి మామూలుగా తిరుగుతాను. అప్పటివరకూ నీకో బాధ్యత వప్పజెపుతున్నాను. మీ అంకుల్‌కు యింత వయసు వచ్చింది కానీ దినేష్‌కంటే అన్యాయం. తనకేం కావాలో ఆయనకే తెలీదు. అన్నీ టైమ్‌కు నేనందిస్తుంటే, అందుకోవడమే తెలుసు. పనివాళ్ళు ఎంతైనా యింటి మనుషులు కాలేరుగా. ఆయన టిఫిన్ సరిగ్గా చేయరు. భోంచేయరు. ఇప్పుడింక చెప్పనే అక్ఖర్లేదు. తనని గురించి తను అసలు పట్టించుకోరు. అందుకని ఈ మూడువారాలూ నువ్విక్కడే వుండి అన్నీ చూసుకోవాలి దగ్గరుండి. మీ నాన్నగారికి నేను చెప్పి పంపిస్తాను. ఆయనకు భోజనం మనింటి దగ్గరనుంచే కారియర్ పంపించే ఏర్పాటు చేస్తాను. నువ్వీ సాయం చేయాలి" అంటూ హర్ష చేతులు పట్టుకొని ప్రాధేయపడుతున్నట్లడుగుతున్న శోభాదేవి వైపు చూసిన హర్షకు కాదని చెప్పడానికి నోరు రాలేదు.

"అలాగే ఆంటీ! మీరు చెప్పినట్లే అన్నీ చూసుకుంటాను. మీరు నిశ్చింతగా వుండండి" అంది.

తృప్తిగా వూపిరి పీల్చుకుంది శోభాదేవి.

"ఊ! త్వరగా క్రిందికి వెళ్ళు. వంట మనిషి ఏదైనా టిఫిన్ చేసిందో లేదో కనుక్కొని, చేయకపోతే చేయించి, మీ అంకుల్ చేత తినిపించాలి. ఆ తర్వాత స్ట్రాంగ్‌గా ఓ కప్పు కాఫీ కలిపి యివ్వాలి" అంటున్న శోభాదేవి మాటలు నోట్లో వుండగానే పరుగులాంటి నడకతో క్రిందకు వెళ్ళిపోయింది హర్ష.

హడావుడిగా వంటింట్లో ప్రవేశించిన హర్ష అక్కడ టిఫిన్‌చేసే ప్రయత్నాలేవీ కనిపించకపోవడంతో వంటామెను అడిగింది.

పాటిబండ్ల విజయలక్ష్మి

"అమ్మగారు అలా పడి వున్నారు కదమ్మా! అయ్యగారినడిగితే నాకేం వద్దు అన్నారు. అందుకని ఏమీ చేయలేదు." ఆంటీ మాటలు ఎంత నిజం? వాళ్ళకేం పట్టింది? వద్దంటే వూరుకుంటారు అనుకొని గబగబా సేమ్యా వుప్మా చేయమని చెప్పి అంకుల్ గదివైపు వెళ్ళింది. గబగబా ఆ ప్రయత్నంలో పడింది వంటామె.

రావుగారి రూమ్‌లో అడుగుపెట్టిన హర్షకు బాత్‌రూంలో నుంచీ షవర్ శబ్దం వినిపిస్తోంది. స్నానం చేస్తూనే "శోభా! టవల్‌తీసి పెట్టావా?" అంటూ కేక వేశారు.

గబగబా బీరువా దగ్గరకు వెళ్ళిన హర్ష పాంటూ షర్టూ, టై, కోటూ, కర్చీఫ్ అన్నీ మాచింగ్‌గా తీసి మంచం మీద పెట్టి మళ్ళీ వంట గది వైపు పరుగెత్తింది.

స్నానం చేస్తూనే అప్రయత్నంగా అలవాటు ప్రకారం శోభను కేకవేసిన రావుగారికి మొట్టమొదటిసారిగా శోభ తనకెంత అవసరమో తెలిసి వచ్చింది. ఆమె లేకుండా ఒక్కక్షణం గడవదు. ఏం కట్టుకోవాలో కూడా తనకు తెలీదు. అన్నీ అమర్చి పెడితే అందంగా డ్రెస్ చేసుకోడం, రుచిగా తినిపిస్తుంటే తినడం తప్పించి, తనకు తనుగా ఏదీ కావాలని అడగటం అలవాటు లేదు. ఇన్నేళ్ళూ అలాగే గడిచిపోయాయి. ఇన్నాళ్ళకి విధి ఈ అంతరాయం కలిగించడం ఎంత అన్యాయం?

టవల్ చుట్టుకొని రూమ్‌లో అడుగుపెట్టిన రావుగారికి ఎప్పటిలా అన్నీ అమర్చిపెట్టి వుండటం చూసి ఆశ్చర్యమేసింది. గబగబా డ్రెస్ చేసుకొని హాల్లోకి వచ్చిన రావుగారికి ఎవరు తన డ్రెస్ అలా తీసిపెట్టారో అర్థంకాలేదు.

"అంకుల్ టిఫిన్ రెడీ" అంటూ ప్రవేశించిన హర్షను చూడగానే అర్థమైంది రావుగారికి "మీ ఆంటీ నీకి ట్రెయినింగ్ అంతా ఎప్పుడిచ్చింది హర్షా!" అన్నారు చిన్నగా నవ్వుతూ.

"ముందు టిఫిన్‌తినండి అంకుల్-ట్రెయినింగ్ విషయం తర్వాత మాట్లాడవచ్చు. టిఫిన్ ఆరిపోతే బావుండదు. మీరు తింటూ వుండండి, ఆంటీకి పెట్టి నిముషంలో వచ్చేస్తాను" అంటూ మరో ప్లేట్ తీసుకొని పైకి పరుగెత్తింది హర్ష.

శోభకు టిఫిన్ అందించి మంచినీళ్ళిచ్చి, "మీరు తింటూ వుండండి ఆంటీ, అంకుల్‌కు కాఫీ కలిపి యిచ్చి మీకూ తీసుకొస్తాను" అంది చిన్నగా నవ్వుతూ.

114

"హర్షా! నన్ను గురించి తొందరలేదు. అంకుల్ టిఫిన్ చేస్తున్నారు. దగ్గరే కూర్చోవాలమ్మా. లేకపోతే ఓ స్పూన్ తిని ఏదో ఆలోచిస్తూ మంచి నీళ్లు తాగేస్తారు."

"ఓ అయామ్ సారీ ఆంటీ!" అంటూ క్రిందకు పరుగెట్టిన హర్ష మంచినీళ్ళ గ్లాసు చేతిలోకి తీసుకున్న రావుగారి చేతిలోనుంచి గ్లాసందుకుంటూ "అంకుల్ అదేవిటి? టిఫిన్ తినమని పెట్టాను, చూసి, మంచినీళ్ళు తాగమని కాదు" అంటూ నవ్వింది.

నవ్వుతూ మళ్ళీ టిఫిన్ ప్లేటందుకొని హర్ష చెప్పే కబుర్లు వింటూ టిఫిన్ పూర్తి చేశారు.

"ఒన్ మినిట్ అంకుల్" అంటూ లోపలికి పరుగెట్టిన హర్ష కాఫీ కప్పుతో ప్రత్యక్షమైంది.

నవ్వుతూ కాఫీ అందుకున్న రావుగారు, చిరు చెమటలు పట్టిన హర్ష ముఖంవైపు చూస్తూ "నువ్వా తెచ్చుకో హర్షా కాఫీ" అంటుండగానే మా లక్ష్మి కాఫీ తీసుకొచ్చి హర్షకిచ్చింది.

కాఫీత్రాగి రావుగారు కారులో వెళ్ళిపోతుంటే చాలాసేపు అలాగే ఆయన వెళ్ళినవైపే చూస్తుండి పోయింది హర్ష.

*

రావుగారు మామూలుగా ఆఫీసుకెళ్ళి వస్తున్నారు. సాయంత్రం కొంతసేపు శోభతో కూర్చుని కబుర్లు చెప్పుకొని ఆ తర్వాత క్రింద తోటలోకి వచ్చి మొక్కలవైపు చూస్తూ కూర్చుంటారు. ఏదో ఆలోచిస్తూ మధ్య మధ్య హర్ష పలకరింపులతో వులిక్కి పడుతూ మళ్ళీ మామూలుగా నవ్వడానికి ప్రయత్నిస్తారు. ఆ రోజు డాక్టర్ చెప్పిన విషయం విన్న దగ్గరనుంచీ మనసు మనసులో లేదు రావు గారికి. యాంత్రికంగా హర్షను, శోభను బాధపెట్టడం యిష్టంలేక తిని తిరుగుతున్నా, మనసులో విపరీత మైన ఆందోళనగా వుంది. ఫ్రాక్చర్ చిన్నదే అయినా ఆ షాక్ నుంచీ శోభాదేవి కోలుకోలేదు. ఆమె ఆరోగ్యం రోజురోజుకూ క్షీణిస్తున్నట్లే వుంది. దానికి తగ్గట్టు రావుగారిని గురించిన ఆందోళన ఆమెను క్రుంగదీస్తోంది.

ఎంత మామూలుగా వున్నట్లు కనిపిస్తున్నా, రావుగారు మానసికంగా చాలా బాధపడుతున్నారు. మధ్య మధ్య నవ్వుతూ నవ్విస్తూ తిరిగే హర్షే లేక పోతే రావుగారికి పిచ్చెక్కి వుండేదేమో! తన శోభకు టి. బి. వుందని డాక్టర్ చెప్పిన దగ్గరనుంచీ ఏం చేయాలో పాలుపోవడంలేదు. టి. బి క్యూర్ చేయడం అంత కష్టమైన పనేమీకాదు ఈ రోజుల్లో. కానీ ఈ పరిస్థితుల్లో శోభకు ఆ విషయం తెలీ కూడదు. తెలీకుండా మందులు వాడాలంటే అసాధ్యం. డాక్టర్ ఎలాగో ఆలోచించి తనే స్వయంగా టాబ్లెట్స్ తీసుకొచ్చి అవిడకిస్తూ యింజక్షన్స్ యిస్తూ ఏదో బలానికని చెప్పిమభ్యపెడుతున్నాడు. కానీ అలా ఎంతకాలం? ఏదో ఒకనాడు శోభకు ఈ భయంకరమైన నిజాన్ని చెప్పక తప్పదు. అంటు వ్యాధి కనుక జాగ్రత్తగా వుండమని చెప్పాడు డాక్టర్.

కానీ అదెలా సాధ్యం! శోభతో దగ్గరగా కూర్చుని మాట్లాడకుండా ఒక్కరోజైనా తను గడపగలడా? రోజూ రాత్రిపూట పాలు ఒకేగ్లాసులో యిద్దరూ పంచుకుని త్రాగటం అలవాటు. ఇప్పుడు తను క్రింద రూమ్‌లో పడుకుంటున్నాడు. ప్రక్క రూమ్‌లో హర్ష. పైన దినేష్ రూమ్‌లో శోభ పడుకుంటూంది. హర్ష-పైనే ఆంటీదగ్గర పడుకుంటా నంటుందేమో ఎలా వద్దని చెప్పాలా అని మథన పడ్డ రావుగారికి తను, 'ఆ ప్రక్క రూమ్‌లో పడుకో హర్షా' అనగానే తలవూపిన హర్షను చూసి తేలిగ్గా వూపిరిపీల్చుకున్నారు.

"శోభా! నీకేమైనా అవసరమైతే చూడాలంటే చిన్నపిల్ల హర్ష - రాత్రిపూటేం చేస్తుంది? వంటా

చర్మ సౌందర్యం

శారీరక సౌందర్యానికి చర్మ ఆరోగ్యం చాలా అవసరం — అని అందరికీ తెలుసు. కాని అందుకు మనం తీసుకోవలసిన జాగ్రత్తలు — అలా జాగ్రత్త తీసుకోకపోవడం వల్ల వచ్చే వ్యాధులు, వాటి నివారణోపాయాలు మొదలైనవి మాత్రం చాలా మందికి అట్టే తెలియడం లేదు. ఒక రకమైన నిర్లక్ష్యం ప్రబలడం వల్ల మనం ఎన్నో చర్మ వ్యాధులకు గురికావలసి వస్తోంది.

బయటి వాతావరణానికి ప్రత్యక్షంగా గురి అయ్యేది; ఒత్తిడికి, ప్రభావానికి లోనయ్యేది మన శరీరంలో చర్మం మాత్రమే. చర్మవ్యాధులు రావడానికి ఇదే ముఖ్యకారణం. పైగా, మొటిమలు, కురుపులు మొదలైనవి పదిమంది కళ్ళుపడే చోట వచ్చాయంటే దానివల్ల కలిగే బాధ ఒకవంతయితే అది ఎదుటివారికి కనబడుతుందే అన్న మానసిక క్షోభ పదింతలుగా వుంటుంది. ఇది వాటితో బాధ పడేటప్పుడు మాత్రమే కాకుండా అవి మానిన తర్వాత కూడా వాటి స్థానంలో మాసిపోని మచ్చ లుగా, చిన్న చిన్న గుంటలు యేర్పడతాయి. కాబట్టి అవి రాకముందే తగు జాగ్రత్తలు తీసుకోడం, ఒకవేళ వచ్చినా వెంటనే తగు చర్యలు - తీసు కోడం, వైద్యచికిత్స చేయించుకోడం చాలా అవసరం. చర్మ ఆరోగ్యం గురించి తెలిపే వైద్య విభాగాన్ని ఆంగ్లంలో డెర్మటాలజీ (Dermatology) అంటారు.

చర్మం, గోళ్ళు, శిరోజాలు — వీటిని ఆరోగ్యంగా వుంచుకోవాలంటే వాటిని ఎప్పుడూ పరిశుభ్రంగా వుంచుకోవడమే దానికి మొదటి మెట్టు. ముఖ్యంగా పిల్లలను రోజుకు కనీసం రెండుసార్లు మంచి సబ్బుతో స్నానం చేయించడం మంచిది. మంచి షాంపూతోనో లేదా అభ్యంగ స్నానం ద్వారానో వారానికి రెండుసార్లు శిరోజాలను శుభ్రం చేసు కోవాలి.

గోళ్ళు మురికిగా వున్నట్లయితే అసహ్యంగా వుండడం మాత్రమేకాదు. సూక్ష్మక్రిములు నోటి ద్వారా జీర్ణాశయానికి చేరడానికి ఇవి దోహదం చేస్తాయి.

అతిప్రాచీన కాలం నుంచే స్త్రీలు అలంకార ద్రవ్యాలను ఉపయోగిస్తున్నారు. అలంకార ద్రవ్యాలు అందాన్ని ఇనుమడింపజేస్తాయి కూడా. అయితే, చర్మ ఆరోగ్యదృష్ట్యా వాటిని మానుకోమనడం సబబుకాదు. సాధ్యం కూడా కాదు నేటి ఆధునిక వనితలకు. కాబట్టి ఇక్కడ ఒక్క విషయం గుర్తుంచుకుంటే చాలు. ఘాటైన ఆమ్లాలు, కాస్టిక్ సోడా మొదలైన రసాయనిక పదార్థాలు ఎక్కువగా వున్న సబ్బులు ఉపయోగించినట్లయితే అవి శరీరం నుంచి ప్రకృతి సిద్ధంగా స్రవించే నూనె పదార్థాలను పూర్తిగా పీల్చివేస్తాయి. చర్మం మరీ పొడిగా తయారవుతుంది. అంచేత మంచి రకాలను ఎంపికచేసి వాటినే వాడడం ఉత్తమం.

అందరూ గుర్తించుకోవలసిన మరొక ముఖ్య విషయం - అందం, ఆరోగ్యం అవినా భావ సంబంధం కలదన్న విషయం. అంచేత శక్తివంత మైన ఆహారం, తగినంత వ్యాయామం, విశ్రాంతి- శరీర ఆరోగ్యంతోపాటు అందానికి కూడా ఎంతో దోహదం చేస్తాయి.

మెను నీ గదిలో పడుకోబెట్టుకో '' అన్నారు.

శోభ జబ్బు విషయం తెలీని హర్ష ఆమెతో మరీ క్లోజ్‌గా వుండవచ్చు-అలా ఆ జబ్బు హర్షకు సంక్రమించవచ్చు. అందుకే ముందు ఆలోచనతో సాధ్యమైనంతవరకూ హర్షను శోభ రూమ్‌లో వుండనిచ్చేవారు కాదు. ఏదో పని చెప్పి క్రిందకు పంపించేవారు.

'' పాపం! హర్షను నా దగ్గర అయిదు నిముషాలన్నా వుండనివ్వరేమండీ '' అంది శోభ.

'' ఏవో జోక్స్ వేస్తుంటుంది. నువ్వు కదిలి కదిలి నవ్వుతావు - కాలు ఎక్కడ కదుపుతావోనని నా భయం '' అంటూ ముంగురులు సవరిస్తున్న రావుగారివైపు ఆప్యాయంగా చూస్తూ ఆ చేతిని తీసి పెదాలకంటించుకుంటుంది శోభాదేవి.

కళ్ళనిండా తిరిగిన కన్నీళ్ళను అదుపులోకి తెచ్చుకుంటూ ' యిప్పుడే వస్తాను శోభా ' అంటూ తప్పించుకుని క్రిందకి వెళ్ళిపోయేవారు.

ఉత్సాహంగా యింటిపెత్తనం చేస్తూ రావుగారికి అన్నీ అందిస్తున్న హర్షలో ఏదో అలజడి మొదలైంది.

మొదటినుంచీ రావుగారి మీద పెంచుకున్న ఆరాధన ఇప్పుడు వొంటరిగా శోభ బదులుగా తను సేవలు చేయడంతో మరింత ఆత్మీయత పెంచుకుంది. ఆయనకు టిఫిన్ పెడుతున్నా, కాఫీ అందిస్తున్నా, బట్టలుతీసి పెడుతున్నా ఏదో అవ్యక్తానందం కలుగుతోంది. ఆయనతో కబుర్లు చెబుతున్నా ఏదో మునుపెన్నడూ కలగని వో అతీతమైన ఆనందానుభూతి.

మైమరచినట్లు తనను అలాగే చూస్తుండిపోయే హర్ష చూపులు రావుగారిని ఇబ్బంది పెడుతున్నాయి. అసలే మానసికంగా బలహీనంగా వున్న ఆయనలో హర్ష చూపులు కలవరాన్ని కలిగిస్తున్నాయి.

హర్షలోనూ ఏమూలో తన భావాలూ, వూహలూ తప్పు అనే అభిప్రాయం అంతర్గతంగా రగులుతున్నా, రావుగారి సన్నిధిలో సర్వం మరచిపోయినట్లుండేది. అప్పుడు ఎవ్వరూ గుర్తు వచ్చేవారు కాదు. ఆయన ఆఫీసుకెళుతుంటే అలా చూస్తూ నుంచోడంలో ఏదో ఆనందం.

ఆ రోజు హర్ష మనసు వెర్రి ఆనందంతో గంతులు వేస్తోంది. కారణం రావుగారు ఆఫీసు కెళ్ళలేదు. శోభాదేవి రూమ్‌లోనూ కూర్చో లేదు.

క్రింద ఆయన రూమ్‌లోనే పడుకొని వున్నారు. యాంత్రికంగా స్నానంచేసి డ్రెస్ చేసుకొని కూడా అలాగే పడుకున్నారు. ఎందుకో ఆయన మనసు ఆరోజు విపరీతంగా బాధపడుతోంది. శోభ దగ్గర నిజం దాచి ఆమెకు దూర దూరంగా తిరుగుతూ ఆమెను బాధపెడుతున్నానేమో అన్న బాధ ఆయన్ని సుఖంగా వుండనీయడం లేదు. అప్పటికే పది రోజులు గడిచిపోయాయి. హర్ష తమ యింట్లో ఒక మనిషిగా అయిపోయింది. ఈ ఆపద సమయంలో హర్ష లేకపోతే తను ఎంత యిబ్బంది పడవలసి వచ్చేది? ఆలోచిస్తూ పడుకున్న రావుగారు అడుగుల చప్పుడుకు తలెత్తారు. ఎదురుగా టిఫిన్ ప్లేట్ పట్టుకొని హర్ష కనిపించింది.

'' ఇవ్వాళ టిఫిన్ తినాలని లేదు హర్షా!'' అంటూ లేచి కూర్చున్న రావుగారివైపు ఆప్యాయంగా చూస్తూ—

'' ఎందుకని? ఈరోజు నా చేతుల్తో నేను స్వయంగా చేశాననా?'' అంటూ జంగమూతి పెట్టిన హర్షను చూడగానే రావుగారికి ఛళ్ళున ఎవరో వీపున చరిచినట్లైంది.

సరిగ్గా యివే మాటలు శోభ నోట తను విన్నాడు. పెళ్ళయిన కొత్తలో స్వయంగా పేష్ట్‌లా తయారు చేసుకొచ్చిన వుప్మా చూసి తనన్న మాటకు యిలాగే అంటూ జంగమూతి పెట్టిన శోభను దగ్గిరకు తీసుకొని ఆమెనే తినిపించమని నోరు తెరిచాడు.

అలాగే శోభ తినిపిస్తుంటే పేష్ట్ లాంటి ఆ వుప్మా అమృతంలా అనిపించి అంతా తినేశాడు.

ఓ క్షణం హర్షవైపు మైమరచి చూస్తూండిపోయిన రావుగారు అంతలోనే కళ్ళు వాల్చేసి, '' లేదు హర్షా! నిజంగా తినాలని లేదు '' అన్నారు.

'' ఏవిటి? నిజంగా నేను చేసింది తినాలని లేదా! నేను తినిపించి తీరతాను.'' అంటూ స్పూన్‌తో వుప్మాతీసి రావుగారి నోటి దగ్గర పెట్టింది. ఇంక రావుగారికి ఏం చేయాలో తోచలేదు.

తన వంట్లో వున్న శక్తినంతా కూడదీసుకొని గట్టిగా అరిచారు-'' వద్దని చెబుతుంటే నీక్కాదూ!'' అంటూ స్పూన్ నెట్టేయడంతో ప్లేట్ కూడా ఎగిరి దూరంగా పడింది.

ఒక్కసారి రావుగారివైపు బేలగా చూసిన హర్ష గుడ్ల నిండా నీరు కుక్కుకుని బయటకు పరుగెత్తింది.

*

అంతులేని బాధకు వుపశమనమేమిటో తెలీకుండా మంచం మీద పడి అలాగే వుండిపోయారు రావుగారు. మధ్యాహ్నం భోజనానికి పిలవడానికి వచ్చిన వంటామెతో ఓ కప్పు కాఫీ తెప్పించుకొని తాగి మళ్లీ మంచం మీద వాలిపోయారు. అసలే అల్లకల్లోలంగా వున్న మనసుని ఈ హర్ష సాన్నిధ్యం మరింత కల్లోలపరుస్తుంది. పాపం! కష్ట సమయంలో తమను ఆదుకున్న ఆ పిల్లను అలా విసిరి కొడితే ఎంత బాధపడిందో! తెలీక ఆ పిల్ల మూర్ఖత్వంగా ప్రవర్తించినా అనునయంగా సర్ది చెప్పాల్సింది పోయి అలా కసరికొట్టడం ఏం న్యాయం? ఆలోచనలతో జ్వర వేడెక్కిపోతుంటే నెమ్మదిగా ప్రక్క మీద నుంచి లేచారు రావుగారు.

హాల్లో అంతా నిశ్శబ్దంగా వుంది.

'' మాలక్ష్మీ!'' అంటూ పిలిచారు.

'' అయ్యా!'' అంటూ పరుగెత్తుకొచ్చింది పనిమనిషి.

'' హర్ష ఎక్కడుంది?'' అన్నారు.

''అమ్మగారికి అన్నం తినిపించి తమ గదికొచ్చి పడుకున్నారండి. అయ్యా! హర్షమ్మ పొద్దుటి నుంచీ ఏమీ తినలేదండీ '' కబురు చెప్పి నెమ్మదిగా తప్పుకుంది లక్ష్మి. హర్షవున్న గదివైపు అడుగులు వేశారు రావుగారు. మంచం మీద ఓ ప్రక్కకు వొరిగి పసిపాపలా నిద్రపోతోంది హర్ష. అప్పటి వరకూ ఏడ్చినందుకు గుర్తుగా కన్నీళ్ల చారికలు కనిపిస్తున్నాయి బుగ్గల మీద. విశ్రాంతిగా మూసుకొని వున్న ఆ రెప్పలతడి యింకా అలాగే వుంది.

ఓ క్షణం అలాగే చూస్తూ నుంచుని హాయిగా నిద్రిస్తున్న హర్షను లేపడానికి మనసు రాక చిరు చెమటలు పడుతున్న హర్ష ముఖంవైపు ఓసారి చూసి ముంగురులు సవరించి ఫానువేసి బయటకు వెళ్ళారు.

నెమ్మదిగా మెట్లెక్కి పైకి వెళ్ళారు. శోభాదేవి హాయిగా నిద్రపోతోంది. ఫోంచేసి టాబ్లెట్ వేసుకుంది కాబోలు వెంటనే నిద్రపట్టి వుంటుంది. అవన్నీ అలా టైమ్ ప్రకారం జరుగుతున్నాయంటే వాటికి మూలం హర్ష. హర్ష లేకపోతే ఏదీ సక్రమంగా జరిగి వుండేది కాదు. శోభతోపాటు తనూ ఓ బెడ్ మీద పడి వుండేవాడు. అలా తమకు అన్ని విధాలా సాయపడుతున్న హర్షను తనెంత క్రూరంగా అవమానించాడు?

పాపం తను ఎన్నడూ లేంది కోపంగా కసురుకో

గానే ఎలా బెదిరిపోయిందో! జాలిగా చూసిన ఆ చూపు గుండెల్ని కోసేస్తుంది. కానీ కానీ ... ఏమిటో తనకే తెలీకుండా తనలో ఏదో విపరీతమైన మార్పు కనిపిస్తోంది. వీటన్నింటికీ కారణం శోభ అనారోగ్యం. ఆలోచిస్తూనే నెమ్మదిగా మెట్లు దిగి తన గదిలో ప్రవేశించిన రావుగారు మళ్ళీ బెడ్ మీద పడిపోయారు. శోభ కోలుకునే లోపల తను మంచమెక్కడు కదా! ఈ మానసిక సంఘర్షణతో ఏ పనీ చేయ బుద్ధికావడంలేదు. దానికి తగ్గట్టు అన్నివేళలా శోభకు బదులు హర్ష కనిపిస్తుంటే తన శోభ స్థానం మరెవరో బలవంతంగా లాగేసుకుంటున్నారనే అర్థంలేని ఆలోచన.

కళ్ళు మూసుకున్న రావుగారి కళ్ళవెంట ధారగా కారిపోతున్నాయి కన్నీళ్లు. ఇన్నాళ్ళు, శోభకు దగ్గరగా వుండి దూరంగా వుండటం ఎప్పుడూ జరగలేదు. ఈ ఆవేదన భరించరానిదిగా వుంది. ఆత్మీయులకు దగ్గరగా వుంటూ వారికి దూరంగా వుండవలసి రావడం కంటె ఘోరం మరొకటి లేదు. ఆలోచనలతో తల దిమ్మెక్కిపోతోంది. ఎంత టైమ్ గడిచిపోయిందో తెలీదు.

చల్లని చేయి నుదుటిమీద పడటంతో కళ్ళు విప్పి చూశారు. ఆ చేతిని అలాగే నుదుట నొక్కిపడుతూ మరో చేత్తో మంచం మీద కూర్చోబెట్టుకున్నారు. వచ్చింది హర్షని తెలుసు. కానీ ఆక్షణంలో తనకు మనశ్శాంతి నివ్వడానికి వచ్చిన దేవతలా కనిపించింది ఆ చిరువెలుగులో. గదిలో లైట్ లేదు.

మంచం మీద కూర్చున్న హర్షను తనే గుండెల మీదకు లాక్కున్నాడో హర్షే వాలిపోయిందో తెలీదు. మండుతున్న నిప్పులా వున్న రావుగారి శరీరం తగలగానే ఘనీభవించిన మంచు కరిగినట్లు కరిగిపోయిన హర్ష ఆయన్ను హత్తుకుపోయింది.

ఏం జరుగుతుందో తెలుసుకునే స్పృహ యిద్దరిలో లేదు. జరిగింది తెలుసుకునేసరికి రావుగారికి తన మీద తనకే అసహ్యం పుట్టింది.

అన్నెం పున్నెం ఎరుగని ఓ కన్నెపిల్ల బ్రతుకును నాశనం చేసిన కిరాతకుడా తను? ఇలా ఎందుకు జరిగింది? దీనికెవరు బాధ్యులు? తను తెలిసి చేసిన పాపానికి పరిష్కారమేమిటి? క్షణికావేశంలో తొందరపడి తప్పు చేసే వయసు కాదు తనది. తన ప్రేమతో, ఆరాధనతో తనని కరగించివేసిందా హర్ష? కొడుకు పెళ్ళీడు కొచ్చిన ఈ వయసులో తను చేసిన ఈ పాపానికి హర్ష బ్రతుకేమౌతుంది? ఈ విషయం తెలిస్తే శోభ తననెంత అసహ్యించుకుంటుంది? ఇన్నాళ్ళూ ఆదర్శమూర్తిగా వెలిగిన తన భర్త అసలు స్వరూపం యిదని తెలుసుకున్న క్షణంలో శోభ బ్రతికి వుంటుందా?

శిశువు — కొన్ని విశేషాలు

* తల్లి కడుపులో వున్నప్పుడే పాపాయి గుండె పనిచేయడం ప్రారంభిస్తుంది. అయితే శ్వాస కోశాలు మాత్రం బయటి ప్రపంచంలో పడ్డ తర్వాతే పనిచేయడం ప్రారంభిస్తాయి.
* పుట్టిన క్షణమే ఏడ్చే శిశువు నలభై రోజులు అయితేగాని నవ్వడం ప్రారంభించదు.
* పుట్టేటప్పుడు శిశువు శరీరంలో వుండే ఎముకల సంఖ్య రోజులు కాను కాను తగ్గిపోతుంది. కొన్ని ఎముకలు ఒకటితో ఒకటి కలిసిపోయి అతుక్కుపోవడమే దీనికి కారణం.
* తల్లి మాట్లాడే మాటలలో సుమారు వెయ్యి మాటలను బిడ్డ—మూడేళ్ళలో నేర్చుకుంటుంది. ఏడేళ్ళు నిండేటప్పటికి నాలుగువేల మాటలు తెలుసుకుంటుంది.
* పాపాయి నవ్వుతూ, సంతోషంగా వున్నప్పుడే కొత్త కొత్త విషయాలను చాలా సులభంగా చకచకా నేర్చుకోగల్గుతుంది.

డాక్టరేట్ పుచ్చుకొని ఆనందంగా తిరిగి వస్తున్న కొడుక్కు తను ముఖమెలా చూపించగలడు?

*

రావుగారి రూమ్ నుంచీ పరుగెత్తిన హర్ష తన రూమ్‌లోకెళ్ళి పడింది. శరీరమంతా వింతగా కంపిస్తోంది. హృదయపు చప్పుడు తనకే భయం కలిగిస్తోంది. ఏం జరిగింది? తను రావుగారిని ఆరాధిస్తున్నట్లు మనసుకు తెలుసు. అంతేగానీ ఆయన సమక్షంలో అంత వివశత్వంతో బేలగా మారి సర్వం ఆయన కర్పించే బలహీనత తనలో వుందని ఆ క్షణం వరకూ హర్షకు తెలీదు.

ఓ ప్రక్క ఏదో తెలీని ఆనందం. మరో ప్రక్క అంతులేని ఆవేదన. తన మనసేమిటో తనకే తెలీకుండా పోయింది. రావుగారి సమక్షంలో ఎంత నిశ్చింతగా ప్రశాంతంగా అనిపించింది?

ఆ నిశ్చింత ఏమైంది? ఆ ప్రశాంతత ఎక్కడ దాక్కుంది? తను తప్పు చేసిందా? తను మనస్ఫూర్తిగా ఆరాధించే మూర్తికి సర్వస్వాన్నీ అర్పించడం తప్పెలా అవుతుంది? జరిగిందానికి నేను బాధపడితే నా ప్రేమ పవిత్రమైనదెలా అవుతుంది?

నిజానికి ఆయన తప్పేం లేదు. అనుక్షణం తను కవ్విస్తున్నా తప్పించుకుంటూ తననెంతో అభిమానంగా చూసేవారు. శోభ ఆంటీ అంటే ఆయనకెంత ప్రేమ వుందో తను కళ్ళారా చూసింది. ఆమె ప్రేమలో—ఆవిడ అనారోగ్యంగా వున్నదన్న ఆవేదనలో ఆయన పిచ్చివాడుగా మారడం తను సహించలేకపోయింది.

ఆయనకు శోభ ఆంటీ మీద ప్రేమ ఎంతటిదో తనకు ఆయన మీద ప్రేమ అంతటి గొప్పది. అందుకే ఆయన్ని అనుక్షణం అంటిపెట్టుకొని తిరిగింది. ఆయన విసుక్కున్నా సహించింది. ఇలా సాగుతున్నాయి హర్ష ఆలోచనలు.

*

వాళ్ళలా ఆలోచనల్లో వుండగానే తెల్లవారింది. హర్ష మామూలుగా లేచి శోభ ఆంటీకి పాలు తీసుకెళ్ళి యిచ్చింది. ఆమె ఆప్యాయంగా నవ్వుతూ పాలందుకుంటుంటే హర్ష ఏదోగా ఐపోయి, తల వంచుకుంది.

"హర్షా! మరో నాలుగు రోజులు వోపికపట్టు.... మా దినేష్ వచ్చేస్తే నీకింత అవస్థ వుండదు. తోచకపోవడమూ వుండదు. వాడు ఇరవైనాలుగు గంటలూ కబుర్లు చెప్పమన్నా చెబుతాడు. నీకు మంచి కాలక్షేపం దొరుకుతుంది." అంది శోభాదేవి నవ్వుతూ.

[సశేషం]

పెద్దకథ:

తెలిసి చేసిన పాపం 3

మౌనంగా గ్లాసందుకొని వెళ్ళిపోతున్న హర్ష వైపు చూస్తూండిపోయింది శోభాదేవి.

ముఖం కడుక్కుని అలాగే స్నానం కానిచ్చి వచ్చిన రావుగారు బీరువా దగ్గరకు వెళ్ళి ఏవో చేతికందిన బట్టలు తగిలించుకుని గబగబా పైకి వెళ్ళారు.

నిజానికి ఆ రోజు పైకి వెళ్ళాలని, శోభకు ముఖం చూపించాలనీ లేదు. కానీ శోభ అలవాటుకు విరుద్ధంగా ప్రవర్తిస్తే బాధపడుతుందని పైకి వెళ్ళారు.

మంచం దగ్గరగా వేసి వున్న చెయిర్లో కూర్చున్న రావుగారు శోభ ముఖంలోకి చూడలేకపోతున్నారు. ఇంతలో హర్ష ఓ ప్లేట్లో ఇడ్లీ పెట్టుకుని ప్రవేశించింది.

"ఏమిటి హర్షా! మీ అంకులింకా టిఫిన్ చేయ లేదూ? ఏమిటి ఇవ్వాళ అదోలా వున్నారు? ఆరోగ్యం బావుందికదా!" అంది ఆదుర్దాగా.

తను అనారోగ్య పరిస్థితిలో వుంటే కూడా తన ఆరోగ్యం గురించి ఆరాటపడుతున్న శోభకు తనెంత ద్రోహం చేశాడు? ప్లేట్ టీపాయ్ మీద పెట్టి మౌనంగా క్రిందికెళ్ళిపోతున్న హర్షవైపూ రావుగారి వైపూ చూస్తూ—

"ఏం జరిగిందండీ! హర్ష కూడా అదోలా వుందేం? గలగలా నవ్వుతూ మాట్లాడేది. మూర్తీభవించిన మౌనంలా వుందేమిటి యివాళ ప్రొద్దుటి నుంచీ? దినేష్ దగ్గర్నుంచేమైనా కబురొచ్చిందా?" ఆత్రుతగా ప్రశ్నిస్తున్న శోభాదేవి వైపు ఓసారి చూసి తల దించుకుంటూ "నో! నో! అలాంటిదేమీ లేదు శోభా! నాకు కొంచెం తల నొప్పిగా వుంది. ఇవాళ ఆఫీసుకు త్వరగా వెళ్ళాలి. హర్ష ఒకవేళ వాళ్ళ నాన్నగారి మీద బెంగపెట్టుకుందేమో! పోనీ వాళ్ళింటికి పంపిద్దామా?" అంటున్న రావుగారి వైపు విచిత్రంగా చూసింది శోభాదేవి.

అంతలోనే సర్దుకుంటూ లేచి నిలబడి—

"శోభా! మరి నే వెళ్ళిరానా? అర్జంట్ పని వుంది." అంటూనే సమాధానం కోసం చూడకుండా గబగబా వెళ్ళిపోతున్న రావుగారి వైపు చూస్తూ ఆలోచనలో పడిపోయింది శోభాదేవి.

ఇన్ని సంవత్సరాల్లో ఎప్పుడూ రావుగారు తన సమక్షంలో అంత నిశ్శబ్దంగా, అన్యమనస్కంగా వుండటం చూసి ఎరుగదు. ఆఫీసు టైమ్ అవుతుందని శోభాదేవి గుర్తు చేస్తున్నా అల్లరిగా మరింత లేట్ చేయడానికి ప్రయత్నిస్తూండేవారు.

అలాంటిది ఈ రోజు అలవాటుకు విరుద్ధంగా తొందరగా ఆఫీసుకు వెళ్ళాలంటూ వెళ్ళిపోయిన రావుగారిలో ఏదో విపరీతమైన మార్పు గోచరిస్తోంది.

అది....అది....తన అనారోగ్యాన్ని గురించిన బాధా! లేక, దినేష్ గురించేమైనా చెడువార్త...

భగవాన్! వద్దు. నాకంతటి శిక్ష విధించకు. నేను నా దినేష్‌ను గురించిన ఎలాంటి చెడ్డ వార్త వినడానికి సిద్ధంగా లేను. వాడు సలక్షణంగా నా సమక్షంలో వుండేలా అనుగ్రహించు తండ్రీ శ్రీనివాసా!....అంటూ మనసులోనే ఏడుకొండల వాడిని వేడుకుంటూ చంపలప్రక్కగా కారిపోతున్న కన్నీటిని తుడుచుకుంటూ అలాగే వుండిపోయిన శోభాదేవి వున్నట్టుండి ఒక్కసారిగా "హర్షా! హర్షా!" అంటూ కేక వేసింది. మళ్ళీ అంతలోనే ప్రక్కనే వున్న బెల్లు జ్ఞాపకం వచ్చి ప్రెస్ చేసింది.

హడావుడిగా పరుగెత్తుకువచ్చింది పని మనిషి మా లక్ష్మి.

"ఏమ్మా! ఏం కావాలి."

"లక్ష్మీ! హర్ష ఏం చేస్తోంది?

"అమ్మాయిగారు గదిలో పడుకొని వున్నారమ్మా!" అంది లక్ష్మి. "ఈ టైములో పడుకోవడమేమిటి?" అంటున్న శోభాదేవి వైపు చూసి—

"ప్రొద్దుట నుంచీ కాఫీ కూడా తాగలేదమ్మా! తల నొప్పిగా వుందని పడుకున్నారు."

"సరే నువ్వు వెళ్ళి హర్షను దినేష్ ఆల్బమ్ పట్టుకొని నేను పైకి రమ్మన్నానని చెప్పు. హర్షకు కాఫీ, టిఫిన్ పైకి తీసుకురా" అంటూ దిండు మీదకు వాలిపోయింది శోభాదేవి.

లక్ష్మి గబగబా క్రిందికి వెళ్ళిపోయింది.

మరో పావుగంటకు ముఖం శుభ్రంగా కడుక్కొని ఫ్రెష్‌గా తయారయి నవ్వుతూ దినేష్ ఆల్బమ్ పట్టుకొని పైకి వెళ్ళింది హర్ష.

ఆల్బమ్ శోభాదేవి మంచం మీద పెడుతూ తన ప్రక్కన కూర్చుని—

"ఏం ఆంటీ! యింకో నాలుగు రోజుల్లో చూడబోతున్న కొడుకు మీద బెంగగా వుందా? మళ్ళీ అబ్బాయిగారి అల్లరి ఫోటోలన్నీ చూసుకుంటే తప్ప మనసు కుదుటపడదన్న మాట!" అంది నవ్వుతూ. ఎంత మామూలుగా ఆ మాటలు అనడానికి ప్రయత్నించినా హర్ష గొంతులో ఏదో అడ్డంపడ్డట్లే వుంది.

అయితే మళ్ళీ హర్ష నవ్వుతూ ఆల్బమ్ తీసుకు రాగానే తృప్తిపడ్డ శోభాదేవి హర్ష గొంతులోని ఆ చిన్న మార్పును గమనించే స్థితిలో లేదు. కుదుటపడ్డ మనసుతో ఆల్బం అందుకొని ఫోటోలు చూస్తూనే—

"హర్షా! నువ్వు టిఫిన్ చేశావామ్మా? తల నొప్పిగా వుందన్నావట. మీ అంకుల్ రూమ్‌లో టాబ్లెట్స్ వుంటాయి, ఓ టాబ్లెట్ వేసుకొని కాఫీ త్రాగు తల నొప్పి సర్దుకుంటుంది!" అంది. 'టాబ్లెట్‌తో చల్లారే ఆవేదన కాదు ఆంటీ! నేను మీకు తీరని ద్రోహం చేశాను. అయినా ధైర్యంగా మీముందు యింకా నిలబడి వున్నానంటే నేను మనిషిని కాదు. నాలో ఏదో పిశాచం ఆవహించి వుంది. అదే నాకాళ్ళ కివిస్తోంది. అదే నన్ను వశపరచుకుంది....అంకుల్ మీద నాకు కలిగిన భావానికి ఏమని పేరు పెట్టాలో నాకే తెలీడం లేదు. ఆరాధన అననా, అనురాగం అననా? అదేమీకాదు కేవలం వయసు కలిగించిన వాంఛ అననా? ఏది అన్నా అనకపోయినా జరిగింది సరిదిద్దుకునే అవకాశం లేదు. ఈ ఆలోచనలన్నీ మనసులో సుళ్ళు తిరుగుతుంటే మౌనంగా ఆల్బమ్‌లోని బొమ్మలవైపే చూస్తూ కూర్చున్న హర్ష దగ్గర నుంచీ జవాబు రాకపోవటంతో తలెత్తి చూసిన శోభాదేవి—

ఆల్బంలోకి గుచ్చి వున్న హర్ష చూపులకు మరో అర్థాన్ని వూహించుకొని—

"హర్షా! ఆల్బమ్ చూస్తే నా మనసు కుదుటపడటం ఏమోగానీ, నీ తలనొప్పి పారిపోయి నట్లుంది. ఇంత మాత్ర అవసరం లేదుకదూ!" ఇంతలో లక్ష్మి తీసుకొచ్చి పెట్టిన టిఫిన్, కాఫీ చూసి.

"అదుగో ముందు టిఫిన్ చెయ్యి. తీరిగ్గా తర్వాత మాట్లాడుకుందాం!" అంటున్న శోభాదేవి మాటకు ఎదురు చెప్పలేక బలవంతంగా టిఫిన్ నోట్లో కుక్కుకోక తప్పలేదు హర్షకు. ఆ తర్వాత లక్ష్మి యిచ్చిన కాఫీ కూడా త్రాగక తప్పలేదు.

ఖాళీ ప్లేటూ కప్పు తీసుకొని లక్ష్మి క్రిందకు వెళ్ళిపోయింది. హర్ష చేయి తన చేతిలోకి తీసుకుంటూ శోభాదేవి దిగులుగా అన్నారు.

"హర్షా! ఎందుకో యివాళ మీ అంకుల్ చాలా మూడీగా వున్నారు. మాకు పెళ్ళైన యిన్ని సంవత్సరాల్లో ఆయన్ని నేనెప్పుడూ ఇంత దిగులుగా చూడలేదు. నా అనారోగ్యం ఆయన్ని చాలా బాధ పెడుతోంది. నేను లేచి తిరగగలుగు తానో లేదోననే అనుక్షణం ఆలోచిస్తూ మథనపడు తున్నారనుకుంటాను. దినేష్ వస్తే ఇంట్లో మళ్ళీ సందడివస్తుంది. వాడితో వచ్చేపోయే ఫ్రెండ్స్‌తో హడావుడిగా వుంటుంది యిల్లు. అప్పుడాయనకు నన్ను గురించిన బాధ అంత వుండదు. దేవుడు అనుగ్రహిస్తే అప్పటికి నేను లేచి తిరగగలుగుతాను.

ఒకవేళ........ఒకవేళ అలాకాక నా కాలు శాశ్వతంగా యిలాగే వుంచేస్తే నన్ను............ మీ అంకుల్‌నూ, దినేష్‌నూ ఎవరు చూసుకుంటారు? వాడు వచ్చేసరికి అన్నీ ఎవరు అమర్చి పెడతారు? ఇన్ని సంవత్సరాల తర్వాత యింటికి వస్తున్నవాడికి ఎంత బాధగా వుంటుంది?" అంటున్న శోభాదేవి కళ్ళవెంట జలజలా కురుస్తున్న కన్నీటిని తన పమిటచెంగుతో అద్దుతున్న హర్ష కళ్ళు కూడా అంతకు రెట్టింపుగా వర్షించాయి.

"ఆంటీ! మీరు బాధపడకండి నేను లేనూ, అన్నీ నేను చూసుకుంటాను. అయినా మీ కాలు బాగైపోతుంది. మీరు అనవసరంగా మనసు పాడు చేసుకోకండి. దినేష్‌కు ఏమేం కావాలో చెప్పండి. అన్నీ స్వయంగా నేనే సిద్ధం చేస్తాను. మీరుండి చేసినంత శ్రద్ధగా అన్నీ చేస్తాను" అంటున్న హర్ష గొంతు బాధతో మెలితిరగడం గమనించిన శోభాదేవి—

"పిచ్చి పిల్లా ఎందుకలా బాధపడతావు? నాకు తెలుసు. నువ్వుంటే నేను నిశ్చింతగా వుండవచ్చు. ఎవర్ని గురించీ నేను బాధపడవలసిన పనిలేదు. ముఖ్యంగా యింక. దినేష్‌ను గురించిన దిగులు కూడా నాకు లేదు. ఈ బంగారుబొమ్మ మా ఇంట్లో అడుగు పెట్టిన రోజే అనుకున్నాను. ఏదీ - కళ్ళు తుడుచుకో" అంటూ నవ్వుతూ చెయ్యి ముందుకు చాపి హర్ష కన్నీళ్ళు తుడవడానికి ప్రయత్నించిన శోభాదేవి గుండెల మీద వాలిపోయి వెక్కి వెక్కి ఏడ్చింది హర్ష.

పాటిబండ్ల విజయలక్ష్మి

ఖంగారు పడిన శోభాదేవి బలవంతంగా హర్షను పైకి లేపుతూ—

"ఎందుకమ్మా అలా ఏడుస్తున్నావు? మీ నాన్న గారేమైనా అన్నారా? అంకులేమైనా పొరపాటుగా మాట్లాడి నొప్పించారా? లేక, నేనన్న మాటలు నిన్ను బాధ పెట్టాయా?" అన్నారు కళ్ళు తుడుస్తూ.

"లేదాంటీ! ఎవరూ ఏమీ అనలేదు. నాకే.... నాకే....విపరీతంగా తలనొప్పిగా వుంది. అందుకే.... అందుకే...." అంటూ వెక్కుతున్న హర్షవైపు ఆప్యాయంగా చూస్తూ చిన్నగా నవ్వి—

"నువ్వు మా దినేష్‌కు తోడుపోయినదానివే. ఏ కొంచం తలనొప్పి వచ్చినా యింట్లో అందర్నీ ఖంగారు పెట్టేస్తాడు. గొడవ గొడవ చేసేస్తాడు. పిచ్చీ! తలనొప్పి కెవరైనా ఏడుస్తారా ఛా! ఛా! లే, లేచి ముఖం కడుక్కొని ముందు క్రిందకెళ్ళి టాబ్లెట్ వేసుకొని మరో కప్పు కాఫీ త్రాగి కాసేపు పడుకో. బాగా పుస్తకాలు చదివుంటావు. మీ అంకుల్ రానీ చెబుతాను. ఆ పుస్తకాల బీరువాకు ఓ తాళం బిగించమని" అని శోభాదేవి అంటుండగానే "వెళతాను ఆంటీ. కాసేపు పడుకుంటాను" అంటూ క్రిందకు పరుగెత్తింది హర్ష.

వెళ్ళి బెడ్ మీద పడ్డ హర్ష చాలాసేపు అలాగే ఏడుస్తూ వుండిపోయింది. ఆ తర్వాత అలాగే పడుకొని నిద్రపోయింది. లేచేటప్పటికి సాయంత్ర మైంది. ఖంగారుగా లేచి వంటగదివైపు పరుగెట్టి "ఆంటీకి అన్నం పెట్టారా? నన్ను లేపలేదేం!" అంటూ లక్ష్మిని అడిగింది ఖంగారుగా.

"అమ్మగారు మిమ్మల్ని లేపొద్దన్నారమ్మా! తల నొప్పిగా వుందని పడుకున్నారని చెప్పారు. అమ్మగారికి అన్నం పెట్టేసి, కారియర్ ఆఫీసుకు పంపాము. మీరు ఖంగారు పడకండి. మధ్యాన్నం భోజనం కూడా చెయ్యకుండా అలాగే పడుకుండి పోయారు. భోం చేస్తారామ్మా! కాఫీ కలిపి యివ్వనా" అంది వంటామె ఆప్యాయంగా హర్ష వైపు చూస్తూ.

"నాకిప్పుడు ఏమీ వద్దండీ! ఆంటీకి కాఫీ కలిపి యివ్వండి నాలుగైపోయింది. అంకుల్ కూడా వచ్చే టైమైపోయింది. ఏదైనా టిఫిన్ రెడీ చేయండి" అంటూ బాత్ రూమ్‌లోకి వెళ్ళి పోయింది హర్ష.

హర్ష వాలకం చూస్తే జ్వరమొచ్చినదానిలా కనిపిస్తూంది. ఎర్రగా మారిన కళ్ళు వుబ్బి మరింత పెద్దగా కనిపిస్తున్నాయి. ముఖమంతా కందిపోయి నట్లుంది. "ఇవాళ ఈ అమ్మాయికేమైంది? ప్రొద్దుటి నుంచీ అదో మాదిరిగా వుంది?" అనుకుంటూనే స్టౌ అంటించి కాఫీ కలిపే ప్రయత్నంలో పడింది వంటామె.

మరో పదిహేను నిముషాల్లో ఫ్రెష్‌గా తయారయి "లక్ష్మీ! కాఫీ!" అంటూ హుషారుగా వచ్చిన హర్షను చూసి ఓ క్షణం విస్తుపోయి చూస్తుండి పోయిన వంటామె—కాఫీ కప్పు హర్ష చేతిలో పెట్టింది నవ్వుతూ.

కాఫీ తీసుకుని పైకి వెళ్ళిన హర్ష శోభాదేవి దగ్గిర కూర్చుని "ఆంటీ! మీ టాబ్లెట్‌తో తలనొప్పి ఎగిరి పోయింది. భలే నిద్రపోయాను" అని నవ్వుతూ కాఫీ అందించింది.

"కుంభకర్ణుడి చెల్లెల్లా నిద్రపోయుంటావని నీ కళ్ళూ, ముఖమే చెబుతున్నాయి. అందుకే మధ్యాహ్నం లక్ష్మి వచ్చి "లేపమంటారామ్మా?" అంటే వద్దని చెప్పాను. ఇప్పుడు ఫ్రెష్‌గా లేదూ! కాఫీ తాగావా? మీ అంకుల్‌తోపాటు తాగాలని అలాగే వూరుకున్నావా?" హర్ష బదులు చెప్పే లోపలే లక్ష్మి మరో కప్పు పట్టుకొని పైకి వచ్చి—

"ఈ రోజుకు అమ్మగారితో తాగండమ్మా! మధ్యాహ్నం భోజనం కూడా చెయ్యలేదు. అయ్యగారొచ్చాక మరోసారి కాఫీ తాగొచ్చు లెండి!" అంటూ కప్పు హర్ష చేతిలో పెట్టి నవ్వుతూ శోభాదేవి వైపు చూసి క్రింది కెళ్ళి పోయింది.

ఇద్దరూ కాఫీలు తాగి ఏవో మాట్లాడుకుంటూండ గానే కారు హారన్ వినిపించింది. రోజూ ఆ హారన్ వినగానే నాదస్వరం విన్న నాగులా లేచి క్రిందకు పరుగెట్టే హర్ష ఆ రోజెందుకో లోలోపల వణికి పోతూ మౌనంగా ప్రక్కనవున్న వీక్లీ చూస్తూ కూర్చుంది.

శోభాదేవికి హర్ష కదలకపోవడం కొంత ఆశ్చర్యం కలిగించినా పాపం! నీరసంగా వుందేమో! భోజనం చేయలేదుగదా! అనుకొని వూరుకున్నారు. మరో పది నిముషాల్లో మెట్లమీద చప్పుడు కావడంతో వులికిపాటుగా లేచి నిలబడింది హర్ష.

"నుంచున్నావేం హర్షా! కూర్చో. ఎవరొస్తారు? మీ అంకుల్ పైకి వస్తున్నారు చప్పుడు ఆ మాత్రం గ్రహించలేవూ" అంది నవ్వుతూ. నవ్వడానికి ప్రయత్నిస్తూ "తెలుసు ఆంటీ!" గబగబా గదిలోనుంచీ బయటకు వెళ్ళిపోయింది.

ఎదురుగా వచ్చిన రావుగా- వైపు వద్దను కుంటూనే తలెత్తి చూసింది. ఆయన హర్షను చూడనట్లే గబగబా మెట్లెక్కి శోభాదేవి వున్న గదిలోకి వెళ్ళిపోయారు.

గబగబా క్రిందకు వెళ్ళి టిఫిన్ రెడీ చేయించి, లక్ష్మిని పిలిచి తీసుకెళ్ళి పైన యిచ్చి రమ్మంది. "మీరు తినండమ్మా" అంటే "నాకు తినాలనిలేదు లక్ష్మి వంట్లో బావుండలేదు. ఆంటీ అడిగితే నేను పడుకున్నానని చెప్పు" అంటూ గబగబా గదిలోకి వెళ్ళిపోయింది.

మరో గంటకు రావుగారు క్రిందకు దిగిరావడం తెలుస్తూనే వుంది హర్షకు. అంతక్రితమే లక్ష్మి టిఫిన్ ప్లేట్లు పెట్టినవి పెట్టినట్లే క్రిందకు తీసుకు రావడం చూసింది. ఏమిటని అడిగితే "అయ్యగారు వద్దన్నారమ్మా! అమ్మగారు కూడా తినలేదు" అంది.

మరో అయిదునిమిషాలకు హర్ష వున్న గది లోకి వచ్చిన లక్ష్మి—

"అమ్మాయిగారూ! అయ్యగారు మధ్యాహ్నం భోజనం కూడా సెయ్యలేదమ్మా. కారియర్‌లో పెట్టినయి పెట్టినట్లే వున్నాయి. అయనేందో బ-నా దిగులుగా కనబడుతున్నారు. మీరైనా టిఫిన్ తీసుకెళ్ళి ఇయ్యండమ్మా! తింటారేమో" అంది.

మారు మాట్లాడకుండా టిఫిన్ ప్లేట్ తీసుకుని రావుగారి గదిలో అడుగు పెట్టింది.

ఎయిర్ కండిషన్డ్ గదిలో అడుగు పెట్టగానే ఆ చల్లదనం, తనువును తాకటమే కాకుండా మనసు లోకి కూడా పాకినట్లయింది. అంతవరకూ ఏదో తెలీని అశాంతితో భగభగమండుతున్న మనసుకు ఆహ్లాదకరంగా అనిపించింది ఆ వాతావరణం.

రావుగారు గదిలో లేరు. బాత్‌రూమ్‌లో నుంచి నీళ్ళ చప్పుడు వినిపిస్తోంది. బహుశా స్నానం చేస్తుండి వుంటారు. ప్లేటు టీపాయ్ మీద పెట్టి మంచం మీద కూర్చుని దిండు మీదకు ఒరిగి ప్రక్కనే వున్న పుస్తకం చేతిలోకి తీసుకుంది. నెమ్మదిగా పేజీలు తిరగేస్తూ చదువుతున్న హర్ష క్రమంగా అందులో లీనమైపోయింది.

"హర్షా" రావుగారు గట్టిగా వేసిన మూడో కేకకు వులిక్కిపడి లేచి కూర్చుంది హర్ష.

"హర్షా! మళ్ళీ....మళ్ళీ....నా గదిలోకి ఎందు కొచ్చావ్ హర్షా! నన్నెందుకు ఇలా చిత్ర వధ చేస్తున్నావు?" రావుగారి కంఠంలో ఆవేశం కంటే ఎక్కువ ఆవేదనే ధ్వనించింది.



దీప్తి

(కవితాసంపుటి)

[రచన : కిరణ్మయి; ప్రచురణ : ఆంధ్రప్రదేశ్ బుక్ డిస్ట్రిబ్యూటర్స్, రాష్ట్రపతి రోడ్, సికిందరాబాద్ వెల : రూ. 3-00.]

ఈ కవితా సంపుటికి శ్రీ సి. నారాయణరెడ్డి, శ్రీ కుందుర్తి, శ్రీమతి నాయని కృష్ణకుమారిగార్లు రాసిన పీఠికలున్నాయి. చదవాలని అనిపించేటట్లు ఉన్నాయి. కవి హృదయం తన కవిత్వంలో కంటే, మరొకరి కవిత్వాన్ని ఆశీర్వదించేటప్పుడు మరింత వ్యక్తమౌతుందనిపిస్తుంది ఈ పీఠికలు చదివితే.

"పుస్తకం చదివే తీరికలేని జీవన వ్యాసంగంలో పీఠికలు చదివి తృప్తిపడే మహాత్ములు ఎంతమంది?" అన్నారు నాయని కృష్ణకుమారి. నిజమే. కానీ, పీఠికల్లో ఇంత కవిత్వమున్నప్పుడు ఆ తృప్తి ద్విగిణీకృతమై, కవితను చదివిస్తుంది.

ఈ కవిత్వంలో నిర్దుష్టమైన వ్యక్తిత్వం కనిపిస్తోంది. చెప్పగలిగిన విషయాన్ని ఆదేశంగా మార్చగల నేర్పుంది.

"కలవారికలికిలా
'నల' అడుగుపెట్టింది." —

ఇది ఒక్కటి మాటలగారడి.

"పక్కలకు చూడకు
చూపులవి జాగ్రత్త-
తెల్లతెల్లని, ఆ పరదాల వెనకాల
శాపాల మడుగులుంటాయి జాగ్రత్త" —

ఇందులో అందముంది. కవిత్వముంది. అలోచనుంది.

"సమత్వం ఒక నినాదంగా
ధరిస్తే అది అపాయం."
"ప్రగతి గీతం పాడబోయి
మేలుకొలుపుకు జోలపాడకు
క్రాంతి మార్గం వెదకబోయి
భ్రాంతి ముసుగున ముఖం దాచకు." —

ఈ కవితలో హెచ్చరిక ఉంది. ఒక రకమైన విసుగు ఉంది. కవిత్వంలో స్థైర్యం, నినాదం ఉంటే అది ఆదేశం అవుతుంది.

దరిచేరని పక్షులు

(నవల)

[రచన : పెన్నేరు పావ. ప్రచురణ : ఎడ్యుకేషనల్ పబ్లిషర్స్. కాంగ్రెసు ఆఫీసు రోడ్డు, విజయవాడ-2; వెల : రూ. 7-00.]

చెఃదామనుకున్న మంచి విషయాన్ని, చెప్పే టెక్నిక్‌ను పూర్తిగా అర్థం చేసుకోకుండానే తొందరపడి చెప్పినట్లుంది ఈ నవల. కానీ, ఈ నవలలో మరీ శూన్యంలో నుంచి నిర్జీవత్వం ఊపిరిపోసుకున్నట్లుగా కాక, పాత్రలు, రచయిత్రి అనుభవంలో తెలిసిన వ్యక్తుల చిత్రీకరణలా సజీవంగా ఉన్నాయి. వసుంధర, విశాల తల్లితండ్రుల పాత్రలు చాలా చక్కగా ఉన్నాయి. అయితే హీరో రవి పాత్ర, అతని కుటుంబం పరమ సినిమాటిక్‌గా ఉన్నాయి. విశాల ఇంటి వర్ణన, అక్కడి సంభాషణలు ఒక చక్కటి మధ్య తరగతి సంసారపు ప్రతీకలుగా ఉన్నాయి. ఏదో చెఃదామన్న ఉత్సుకత, తెలిసిందంతా ఒక్కసారి తెలియచెప్పాలనే 'పసితనం' రచనలో కనబడుతున్నా, ఆత్మవిమర్శతో, ఆలోచించి రాస్తే, ఈమె ఒక మంచి రచయిత్రిగా రూపొందే అవకాశాలు చాలా ఉన్నాయనిపిస్తుంది.

"ఈ నవల గురించి...." హరికిషన్‌గారు రాసేటప్పుడు "ఈ సాహిత్య నదీ తరంగాలలో ఓ పెద్ద నవలా రేవులో ఎక్కువగా స్నానాలు చేసేది తెలుగు నవలా రచయిత్రులు. అలా స్నానం చేస్తే సాహిత్యపుణ్యం వస్తుందని వారి నమ్మకం." అన్నారు. ఈ మాటలు చాలా ఆలోచింపదగ్గవిగా ఉన్నాయి.

"అంకుల్! నేను గతించిపోయిన గతాన్ని కాదుగా — మళ్ళీ రాకుండా వుండటానికి. నేను మనిషిని. మమతా మానవత్వం వున్న మామూలు మనిషిని. అందుకే రాకూడదనుకున్నా, రాకుండా వుండలేకపోయాను. మీరు ప్రొద్దుటి నుంచీ ఏమీ తినలేదని తెలిసి ఆగలేకపోయాను. నా మూలంగా మీరెందుకు అలా బాధపడాలి! తప్పు జరిగిందంటే శిక్ష నాకు విధించండి. అంతేగానీ మీకు మీరు శిక్ష వేసుకోవడం ఎందుకు? మీరు అలా వుంటే ఆంటీ ఎంత బాధపడుతున్నారో తెలుసా? క్షమించండి అంకుల్. యింక మిమ్మల్ని బాధపెట్టను వెళ్ళిపోతాను శాశ్వతంగా దూరంగా వెళ్ళిపోతాను" అంటూ వెక్కి వెక్కి ఏడుస్తున్న హర్షను చూసి రావుగారి గుండెకరిగి నీరైంది.

ఈ అమ్మాయి తన నెందుకిలా ఏదో తెలీని బంధంతో కట్టేస్తోంది! హర్షను చూస్తూ కఠినంగా మాట్లాడటం తనకు చాతగావటం లేదు. ఆ ప్రేమమూర్తి శోభకు ద్రోహం చేశానన్న బాధ ఓప్రక్క అన్నెం పున్నెం తెలీని హర్ష బ్రతుకు ఏమవుతుందోనన్న భయం మరోప్రక్క కర్తవ్యమేమిటో తెలీని అయోమయావస్థ.

ఏడుస్తూ తలుపు తీసుకుని వెళ్ళబోతున్న హర్షను చేయిపట్టి లాగారు. తలుపు ఆటోమాటిక్‌గా మూసుకుంది.

హర్ష ఆధారం దొరకగానే అల్లుకుపోయే లతలా రావుగారి గుండెల మీద వాలిపోయి తన గుండె బరువు దించుకుంటోంది. అవిరామంగా వర్షించే కన్నీళ్ళతో రావుగారి గుండెల్ని తడిపేసింది. ఏం చేయాలో తెలీని అయోమయావస్థలో హర్ష తల నిమురుతూ అలాగే వుండిపోయారు రావుగారు.

ఆ స్పర్శలో ఏ రకమైన స్పందన క్రితం రాత్రి కలిగిందో అది యిప్పుడు లేదు. ఆప్యాయంగా తల నిమురుతున్న రావుగారి కళ్ళ నుంచి రెండు కన్నీటిబొట్లు రాలి హర్ష తలలో పడి యింకిపోయాయి. తలెత్తి రావుగారివైపు చూసిన హర్ష నుదుట ఓ కన్నీటిచుక్క పడగానే వులిక్కిపడి రావుగారి దగ్గర నుంచి దూరంగా జరిగింది.

"అంకుల్! మీరు........మీరూ....ఏడుస్తున్నారా!" అంత గంభీరంగా వుండే వ్యక్తి అలా ఎందుకయ్యారు? తనెంత దుర్మార్గురాలు! ఆయన్ని అనవసరంగా ఏడిపించింది. ఆయనకు మానసిక వేదన కలగటానికి తను కారణం. తన మూలంగానే ఆయనలా వివశులయ్యారు. ఆలోచనలకు అడ్డుకట్ట వేసి కళ్ళు తుడుచుకొని రావుగారిని తీసుకెళ్ళి మంచం మీద కూర్చోబెట్టింది. ఆయన మంత్ర ముగ్ధుడిలా చెప్పింది చేస్తున్నారు. ఆయన శరీరం కంపిస్తోంది.

కళ్ళు గట్టిగా తుడుచుకొని నవ్వడానికి ప్రయత్నిస్తున్న రావుగారివైపు చూసి "అంకుల్! ముందు టిఫిన్ తినండి. నేను వెళ్ళి ఆంటీకి యిచ్చి వస్తాను" అంది.

తల వూపారు రావుగారు.

సంతోషంగా బయటకు పరుగెత్తిన హర్ష గబగబా టిఫిన్ తీసుకొని పైకి వెళ్ళి,

"ఆంటీ! అంకుల్ టిఫిన్ చేస్తున్నారు. మీరూ చెయ్యండి." అంటూ ప్లేటు ముందు పెట్టింది. చిన్నగా నవ్వుతూ.

"మరి మీరూ చెయ్యండి" అంది శోభాదేవి.

ఆ రోజెలాగో గడిచిపోయింది. మరు రోజు ఆదివారం.

రోజంతా యింట్లోనే వుంటారు రావుగారు.

శోభాదేవి ప్రక్కనే కూర్చుని కబుర్లు చెప్పుకుంటూ నవ్వుకుంటూ మధ్య మధ్య హర్ష చేత పాటలు పాడిస్తూ ఆ రోజంతా ఆనందంగా గడపటం అలవాటైంది చాలా రోజులుగా. ఆదివారం వస్తుందంటే అదో పండుగలా వుండేది. హర్ష అది మళ్ళీ ఎప్పుడొస్తుందా అని ఎదురు చూసేది.

కానీ ఈ ఆదివారం హర్షకూ రావుగారికి కూడా పెద్ద గండంలా తోచింది. మామూలుగా ఎలాగో కాస్త ఫలహారాలు అయ్యాయి. మిగతా టైమంతా ఎలా గడపాలో తెలీలేదు. శోభాదేవి ముందు ఒక్కరూ రావుగారో లేక హర్షో వుంటే ఎలాగో మానేజ్ చేసి వుండేవారు. కానీ ఆమె ఎదురుగా కూర్చోడానికి యిద్దరికీ మనసులో ఏదో గుబులుగా వుంది.

కానీ అలాగని అలవాటుకు విరుద్ధంగా ఏ ఒక్కరో ఆమె దగ్గర కూర్చున్నా ఆమెకు అనుమానం కలగవచ్చు. ఏం చేయాలో తోచక గదిలో అటూ ఇటూ పచార్లు చేస్తున్నారు రావుగారు. మనసంతా అంతు లేని అశాంతితో వేగిపోతోంది. మునుపటిలా ధైర్యంగా తలెత్తి శోభాదేవి కళ్ళలోకి చూడలేక పోతున్నారు. ఆమె ఎదురుగా కూర్చున్నా కను మరుగైనా తను చేసిన తప్పుని, పాపాన్ని మరచి పోలేకపోతున్నారు.

ఆ పాపానికి ఎవరు బాధ్యులు అనుకుంటే వయసులో పెద్దవాడు కనుక తనే అనే సమాధానం వస్తోంది రావుగారికి. దానితో మరింత కుంచించుకు పోతోంది హృదయం. నెమ్మదిగా డ్రెస్ చేసుకుని బయటకు వెళదామని బయలుదేరుతున్న రావుగారు ఎదురుగా కనిపించిన హర్షను చూసి ఆగిపోయారు.

"మీరు పైకి వెళ్ళి ఆంటీ దగ్గర కూర్చోండి. ఇవ్వాళంతా సరిపడే పిండివంటల పని అప్ప చెప్పారు ఆంటీ నాకు. మీరు వెళ్ళి నిశ్చింతగా పైన కూర్చోవచ్చు. నేను దగ్గరుండి ఆంటీ చెప్పిన వన్నీ చేయిస్తానని చెప్పి వచ్చాను" అంటూ సమాధానం కోసం కూడా ఎదురు చూడకుండా గబగబా వెళ్ళిపోతున్న హర్ష వైపు కృతజ్ఞతగా చూస్తూ మళ్ళీ గదిలోకి వెళ్ళి డ్రెస్ మార్చుకునే ప్రయత్నంలో పడ్డారు రావుగారు.

ఆ రోజంతా శోభాదేవి దినేష్‌ను గురించిన కబుర్లు చెబుతుంటే తాత్కాలికంగా మనసులోని మాలిన్యాన్ని దూరం చేసుకుని ఆమెతో మాట్లాడుతూ ఆమె ఆనందంలో పాలుపంచుకున్నారు రావుగారు.

ఇద్దరికీ భోజనాలు పైకి పంపింది హర్ష, లక్ష్మితో. శోభాదేవి కబురు పెడితే "ఈ రోజుకు నేను క్రిందనుంచీరాను. వస్తే మీ దినేష్‌బాబే వంట కాలు పాడైపోతాయి. ఆ తర్వాత అమ్మా కొడుకూ చేరి నన్ను నిందించి ప్రయోజనం వుండదు." అని నవ్వుతూనే పైకి రాకుండా తప్పించుకుంది హర్ష. సమయస్ఫూర్తిగా పరిస్థితిని తారుమారు కాకుండా చేసిన హర్షను మనసులోనే మెచ్చుకున్నారు రావుగారు.

భోజనాలు కాగానే శోభాదేవిని కొంచం సేపు నిద్రపొమ్మని చెప్పి రావుగారు తమ రూమ్‌కు వచ్చి పడుకున్నారు.

నిద్ర కోసులదూరాన వుంది. శోభ మాటలు మనసులో గిర్రున తిరుగుతున్నాయి. ప్రతి మాటలో హర్షను మెచ్చుకుంటూ తమ అదృష్టం వల్ల ఆ అమ్మాయి తమకింత దగ్గరైందని పదేపదే మురిసిపోతున్న శోభాదేవికి ఏమని చెప్పగలరు? 'శోభా! మన యింటికేదో శని పట్టి అది హర్ష రూపంలో మన సంసారాన్ని, స్వర్గతుల్యమైన ఈ యింటిని నరకప్రాయం చేయబోతోంద'ని మనసులోనే మధనపడటం కంటే మరో మార్గం కనిపించటం లేదు.

ఈ రోజు శోభ వ్యక్తపరచిన మాటలనుబట్టి ఆమెకు హర్షను తమ కోడలిగా చేసుకుంటే బావుండునన్న అభిప్రాయమున్నట్లు అర్థమైంది. తను ఆ ప్రస్తావన రాకుండా వుండాలని దినేష్ మాటలు మొదలుపెడితే అందులోనూ హర్షను కలుపుకునే ఆమె ఆలోచిస్తోంది. తీరని కలలు కంటోంది. హర్ష ఆమె దృష్టిలో అమాయకత్వం, అణకువ, అందం, అనురాగం అన్నింటినీ ఓ మూసలో పోసి బ్రహ్మ సృష్టించిన అపరంజి బొమ్మ. ఆ అపరంజిబొమ్మ తమ కోడలైతే ఎంతో బావుంటుందని శోభ అభిప్రాయం.

పరిస్థితుల ప్రాబల్యానికి లొంగి తను పశువుగా మారకుండా వుంటేవుంటే.... శోభ అభిప్రాయంతో అక్షరాలా ఏకీభవించేవాడే కానీ.... యిప్పుడు.... హర్షను దినేష్‌ను కలపడమనే మరో పాపం చేయడానికి తన మనసు సిద్ధంగాలేదు. అది ఎట్టి పరిస్థితులలోనూ జరగటానికి వీలేదు.

అలాగని ఏ కారణం చెప్పి శోభ మనసు మార్చగలడు? అంత క్రితం హర్షను శోభతోపాటు తనూ అదే భావంతో ఆదరించాడు. ఆ రాక్షస క్షణం వచ్చేవరకూ తనకు హర్ష మీద ఆపేక్ష, అభిమానం తప్ప మరో భావం లేదు. ఇప్పుడూ ఆ భావంలో మార్పు లేదు. కానీ జరిగినదాన్ని ఎలా మరచిపోగలరు? చేసిన పాపాన్ని ఎలా తుడిచేసుకోగలరు? ఆ హర్షను తమ కోడలిగా ఎలా భరించ

Statement about ownership of VANITHA (Telugu)

Rule 8 (Form VI), Newspapers (Central) Rules, 1956

1. *Place of Publication* ... 'CHANDAMAMA BUILDINGS' 2 & 3, Arcot Road Vadapalani, Madras-600 026
2. *Periodicity of Publication* ... MONTHLY 1st of each calendar month
3. *Printer's Name* ... B. V. REDDI
   Nationality ... INDIAN
   Address ... Prasad Process Pvt Limited 2 & 3, Arcot Road Vadapalani, Madras-600 026
4. *Publisher's Name* ... B. VISWANATHA REDDI
   Nationality ... INDIAN
   Address ... CHANDAMAMA PUBLICATIONS 2 & 3, Arcot Road Vadapalani, Madras-600 026
5. *Editor's Name* ... B. VISWANATHA REDDI
   Nationality ... INDIAN
   Address ... 'CHANDAMAMA BUILDINGS' 2 & 3, Arcot Road Vadapalani, Madras-600 026
6. *Name & Address of individuals who own the paper* ... CHANDAMAMA CHILDREN'S TRUST FUND
   BENEFICIERIES:
   1. B. V. HARISH
   2. B. V. NARESH
   3. B. V. L. ARATI
   4. B. L. NIRUPAMA
   5. B. V. SANJAY
   6. B. V. SHARATH
   7. B. L. SUNANDA
   8. B. N. RAJESH
   9. B. ARCHANA
   10. B. N. V. VISHNU PRASAD
   11. B. L. ARADHANA
   12. B. NAGI REDDI

   All Minors—by Trustee M. UTTAMA REDDI, 9/3, V.O.C. Street, Madras-600 024.

I, B. Viswanatha Reddi, hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief.

1st March 1979

B. VISWANATHA REDDI
Signature of the Publisher

గలరు? మనసు విప్పి మరొకరితో, తన మనసులో మనసైన శోభకే చెప్పుకోలేని ఆవేదన భరించడం అసాధ్యంగా వుంది.

కన్నీటితో తలగడ తడిసిపోయింది. కళ్లు ఎర్రగా మంకెన పూవుల్లా మారాయి. నాలుగ్గంటలకు లేచి స్నానం చేసి హాల్లోకి వచ్చిన రావుగారి వాలకం చూస్తే జబ్బుపడిన మనిషిలా కనిపించారు హర్షకు. కాఫీలు కలిపి ఒకటి రావుగారికిచ్చి మరొకటి తీసుకొని పైకి వెళ్ళింది హర్ష.

నెమ్మదిగా రావుగారు కప్పు పట్టుకొని పైకి వెళ్ళారు. శోభ నవ్వుతూ హర్షవైపు చూస్తూ కాఫీ త్రాగుతూ వంటకాల వివరాలడిగి తెలుసుకుంటోంది.

రావుగారు గదిలోకి రాగానే "ఇప్పుడే లేచారా? అబ్బ కళ్ళు వాచేలా నిద్రపోయారన్న మాట! అదృష్టవంతులు. నాకేమో కళ్ళు మూసుకున్నా, తెరచినా దినేష్ కనిపిస్తున్నాడు. ఇంక నిద్రెలా పడుతుంది? ఎప్పుడెప్పుడు వాడిని చూస్తానా అని మనసు వేగిరపడుతోంది. ఇంక హర్షకు పనులతో తీరిక దొరికితేకదా నిద్రపోవడానికి. పాపం! ఆ వంటామెకు చేతకావని నేను చెప్పిన క్రొత్త వంటకాలన్నీ తనే చేసిందట. చెయ్యి కూడా కాల్చుకుంది చూడండి." అంటూ హర్ష చెయ్యి లాగి చూపించింది. చూసి మెదలకుండా వూరుకున్న రావుగారి వైపు చిరుకోపంతో చూస్తూ—

"పిల్ల చెయ్యి కాల్చుకుందని కొంచమైనా జాలిపడ్డారా? ఒట్టి రాతి మనుషులు బాబూ! కొద్దిగా మందేదైనా తెచ్చి రాయకూడదూ?" అంటుండగానే ఆమె చేతిలోని ఖాళీ కప్పు అందుకుంటూ—

"నేను రాసుకుంటానులే ఆంటీ! మీరు అంకుల్‌తో మాట్లాడుతుండండి." అంటూ క్రిందకు వెళ్ళిపోతూన్న హర్షవైపు ఆప్యాయంగా చూస్తుండిపోయిన శోభాదేవి ప్రక్కన కూర్చుంటూ—

'శోభా! కొద్దిగా చెయ్యి కాలినందుకే నీ మనసింత బాధపడుతోందే వళ్ళంతా కాల్చుకుంది ఆవేశంలో అని తెలిస్తే నువ్వు హర్షను క్షమించగలవా? హర్ష వళ్ళు కాలింది. నా మనసు కాలింది. ప్రకృతి ఆడే ప్రళయతాండవం మన బ్రతుకుల్ని ఆశల్ని నిలువంటా కూల్చేసింది. దినేష్ వస్తున్నాడంటే నీకు సంతోషంగా వుండి నిద్రపట్టడం లేదు. కానీ వాడు వచ్చిన తర్వాత ఎదుర్కోవలసిన పరిస్థితుల్ని తలచుకొని నాకు నిద్రపట్టడం లేదు. నీ మొఖం చూస్తూ నిజాన్ని చెప్పలేను. చెప్పకుండా వాళ్ళిద్దరి పెళ్ళికి అంగీకరించి, చేతులారా మరో పాపం చేయలేను.' ఈ మాటలన్నీ మనసులోనే అనుకుంటూ శోభాదేవి చేతిని తన చేతుల్లోకి తీసుకొని మృదువుగా రాస్తూ మౌనంగా కూర్చున్న రావుగారివైపు ప్రేమగా చూస్తూ—

"ఏమండీ! నాకిలాగే శాశ్వతంగా మంచంలోనే వుండిపోతే బావుండుననిపిస్తోంది."

"శోభా! ఏవిటామాటలు నీకేమైనా మతిపోయిందా?"

—"కాదండీ, యింత ప్రేమగా చూసుకునే మీరూ, దినేష్, హర్షా మీ ముగ్గురూ నన్ను కంటికి రెప్పలా చూసుకుంటారని నాకు తెలుసు. ఇంక నేను మంచంలో వున్నా మహారాణి భోగాలే అనుభవిస్తాను. అందుకే అలా అన్నాను మీరు బాధపడకండి. దినేష్ రాగానే హర్షకూ, దినేష్‌కూ పెళ్ళి చేసి వాళ్ళను ఈ యింట్లో వుంచి మనం మన ప్రేమ మందిరానికి, మన పాత యింటికి వెళ్ళిపోదాం. ఈ రోజే హర్ష వాళ్ళ నాన్నగారిని పిలిపించి మాట్లాడండి. ఆయన అభ్యంతరం చెప్పరని తెలుసనుకోండి. అయినా ముందుగా ఆయన అభిప్రాయం తెలుసుకోడం మన బాధ్యత."

రావుగారి మెదడు పని చేయడం మానేసింది. శోభ అప్పుడే అన్ని ఆలోచనలు చేసిందా? ఈ గండం తప్పించడం ఎలా? నిజం చెప్పేస్తే? ఆ పైన ఇంక అక్కడ నిలవలేక "ఇప్పుడే అలా బజారు కెళ్ళొస్తాను శోభా" అంటూ గబగబా క్రిందకు వెళ్ళిపోయారు. అయోమయంగా చూస్తుండిపోయింది శోభాదేవి. అంత అకస్మాత్తుగా రావుగారు అలా ఎందుకు లేచి వెళ్ళిపోయారో అర్థం కాలేదు. తన మాటలు అసలు విన్నారో లేదో?

అయ్యగారు రావడం చూసి షెడ్డు తలుపులు తీస్తున్న డ్రైవర్ అయ్యగారు తనవైపైనా చూడకుండా గబగబా నడిచి వెళ్ళిపోతుంటే ఆశ్చర్యంగా చూస్తుండిపోయాడు.

బంగారు గొలుసులు, దుద్దులు మట్టిపట్టి వుంటే—చిన్న సబ్బు ముక్క వేసిన నీళ్ళలో వాటిని వదేసి, ఆ నీటిని కాసేపు ఉడికించండి. తర్వాత ఆ వస్తువుల్ని తోమితే—ఏవైనా సరే 'కొత్తవి కొన్నారా!' అని అడగవలసిందే!

—వరహాలమ్మ

బయటకు వెళ్ళిన రావుగారు అలా నడుస్తూనే వున్నారు. ఎన్ని బజార్లు తిరిగారో, ఎన్ని మైళ్ళు నడిచారో, ఆయనకే గుర్తులేదు. నడిచి నడిచి కాళ్ళూ, ఆలోచనలతో మెదడూ అలసిపోయేసరికి ఎదురుగా కనిపించిన ఓ సిమెంట్ బెంచీ మీదకు చేరుకున్నారు.

మరో రెండు రోజుల్లో దినేష్ వచ్చేస్తాడు. అప్పుడు శోభ తన కోరిక చెబుతుంది. కాదనటానికి కారణం కనిపించదు. అన్నివిధాలా అందర్నీ ఆకర్షించగల హర్ష దినేష్‌ను ఆకర్షించకపోదు. కానీ ఈ పెళ్ళి జరగటానికి వీల్లేదు. అలా అని తను అంటే, శోభ బాధపడుతుంది. కారణం అడుగుతుంది. అనురాగమూర్తి శోభ ముఖం చూస్తూ తను చేసిన పాపాన్ని చెప్పే ధైర్యం తనకు లేదు. అన్నీ వున్న దరిద్రుడు తనిప్పుడు. అందరూ వున్నా అనాథ తనిప్పుడు. తన బాధ ఎవరితో చెప్పుకోగలడు?

హర్షకు భవిష్యత్తు ఎంతో వుంది. అది తన మూలంగా విఘ్నం కావడం తన కిష్టంలేదు. అలా అని చూస్తూ చూస్తూ తన కోడలిగా చేసుకుని, చేసిన పాపాన్ని మరింత పెంచుకోలేడు. మొదలూ చివరాలేని ఆలోచనలు.

అడుగులో అడుగు వేసుకుంటూ యిల్లు చేరిన రావుగారికి హాల్లో కూర్చుని కునికిపాట్లు పడుతున్న హర్ష కనిపించింది. బూట్ల చప్పుడు కాగానే దిగ్గున లేచి నుంచుంది హర్ష. ఎక్కడివాళ్ళక్కడ అంతా నిద్రపోతున్నారు. పైన లైటన్నీ ఆఫ్ చేసి వున్నాయి. మెట్లవైపు అడుగులు వేయబోయిన రావుగారు హర్ష మాటలతో ఓ క్షణం ఆగిపోయారు.

"ఆంటీ నిద్రపోయారు. మిమ్మల్ని గురించి అడిగితే తల నొప్పిగా వుందని పడుకున్నారని చెప్పాను," అంది తల దించుకుని హర్ష. వెనక్కు తిరిగి ఓ క్షణం హర్షవైపు కృతజ్ఞతగా చూసి పైకి వెళ్ళిపోయారు.

చప్పుడు కాకుండా బెడ్ దగ్గిర నుంచొని బెడ్ లైట్ చిరు వెలుగులో ప్రశాంతంగా నిద్రపోతున్న శోభాదేవి వైపు తదేకంగా చూస్తూ నుంచున్నారు. తమ పరిచయం. ప్రేమ, పెళ్ళి, అనురాగపూరిత దాంపత్య జీవితం, అన్నీ ఒక్కొక్కటే, సినిమా రీళ్ళలా కళ్ళముందు కదిలాయి. టాబ్లెట్ వేసుకుని పడుకుని వుండటం వల్ల శోభాదేవి హాయిగా

నిద్రపోతోంది. అయినా ఆమెకు దిగులేముంది?

దగ్గరగా వెళ్ళి ముంగురులు సవరించి నుదుట ముద్దుపెట్టుకున్నారు. ఆమెలో కదలిక లేదు. మెల్లగా కళ్ళు తుడుచుకుంటూ క్రిందకు దిగి వచ్చారు. ఇంకా అలాగే నుంచొని పైకి చూస్తోంది హర్ష.

రావుగారు రాగానే డైనింగ్‌హాల్ వైపు దారి తీసింది. భోజనాలు సిద్ధంగా వున్నాయి. రాత్రి పదకొండు గంటలైంది. అప్పుడేమీ తినాలని లేదు రావుగారికి. కానీ హర్షను బాధపెట్టడం యిష్టంలేక టేబుల్‌ముందు కూర్చున్నారు. మౌనంగా వడ్డిస్తోంది హర్ష.

"హర్షా! నువ్వు భోంచేశావా?" కళ్ళనిండా నీళ్ళు తిరిగాయి హర్షకు. లేదని అడ్డంగా తల వూపింది. తన ప్రక్కన మరో ప్లేట్ పెట్టి "కూర్చోమ్మా! సారీ. నా మూలంగా నీకూ లేటైపోయింది నువ్వూ భోంచేసి వుండాల్సింది" అంటూ హర్ష చేయిపట్టి కూర్చోబెట్టారు.

రావుగారి మనసిప్పుడు ప్రశాంతంగా వుంది. ఏ ఆలోచనలూ బాధించడంలేదు. అందుకే అంత మామూలుగా హర్షతో మాట్లాడగలిగారు. ఓ నిశ్చయానికొచ్చిన నిశ్చింత కనిపిస్తోంది ఆయన ముఖంలో. తనకు స్వయంగా ఆప్యాయంగా వడ్డిస్తున్న రావుగారి వైపు చిత్రంగా చూస్తుండిపోయిన హర్షను చూసి మెల్లగా నవ్వుతూ వీపు తట్టి "తినమ్మా! చాలా ప్రొద్దుపోయింది" అంటున్న రావుగారి మాటలతో జలజలా రాలిన కన్నీళ్ళు ప్లేట్‌లోపడి అన్నంలో కలసిపోయాయి. ఇద్దరికీ తినాలనిలేదు. ఒకరికోసం ఒకరు కూర్చున్నారని చూస్తేనే తెలుస్తోంది. ఎలాగో భోజనాలు ముగించి, ఎవరి రూమ్‌లోకి వాళ్ళు వెళ్ళిపోయారు.

అంకుల్ రాగానే ఎన్నో మాట్లాడాలనుకున్న హర్ష, ఆయన ముఖం చూస్తూ, ఆప్యాయంగా ఆయన మాట్లాడుతుంటే వింటూ లోలోనే కుంచించుకుపోయింది. ఆ యింట్లో ఆ స్తబ్ధతకూ, నిశ్శబ్దానికి కారణం పరోక్షంగా తనేననే బాధ ముద్ద మింగనివ్వలేదు. గొంతుకేదో అడ్డం పడ్డట్లే అయింది. ఎలాగో తిన్నాననిపించి అన్నీసర్దేసి రూమ్‌లోకి వెళ్ళి పడుకుంది. తలగడ కన్నీళ్ళతో తడుపుతూ ఇంటి కప్పు వైపు చూస్తూ అలాగే పడుకుంది.

రావుగారు రూమ్‌లోకి రాగానే కొంతసేపు దినేష్ ఆల్బమ్ చూస్తూ కూర్చున్నారు. డిగ్రీ పుచ్చుకున్నప్పటి దినేష్ ఫొటోవైపు ఎంతోసేపు అలాగే చూస్తుండిపోయిన రావుగారి కళ్ళలో నీటి పొర అడ్డంవచ్చి దినేష్ ముఖం మసకమసకగా కనిపించింది. ఆప్యాయంగా ఆ ఫోటోని గుండెల కద్దుకొని ముద్దుపెట్టుకున్నారు. దుఃఖం తన్నుకు వచ్చింది. గుండెలు పట్టుకొని చాలాసేపు అలాగే కూర్చుండిపోయారు. బీరువా తెరచి పాత ఆల్బమ్ తీశారు. అందులో శోభ వివిధ భంగిమల్లో తీయించుకున్న ఫొటోలు. తామిద్దరూ కలిసి వెళ్ళిన ప్రదేశాల్లో జంటగా తీయించుకున్న ఫొటోలు. అపురూపంగా దాచుకున్న తమ పెళ్ళి ఫొటోలు— అన్నీ ఒక్కొక్కటే చూస్తూ కూర్చున్నారు చాలా సేపటి వరకూ.

మూడు గంటలకు పడుకొని ప్రశాంతంగా నిద్రపోయారు. మరు రోజు వుదయాన్నే లేచి స్నానం పూర్తిచేసి ఫ్రెష్‌గా తయారయి పైకి వెళ్ళారు.

"గుడ్‌మార్నింగ్ డియర్!" అంటూ శోభాదేవి ప్రక్కన కూర్చున్నారు నవ్వుతూ.

"ఏమిటి విశేషం చాలా హుషారుగా వున్నారు! ఓహో నాకర్థమైంది లెండి, తెల్లవారితే, సుపుత్రుడు వస్తాడనే ఆనందం కదూ" అంటున్న శోభాదేవి కళ్ళలో ఆనంద భాష్పాలు నిలిచాయి.

"ఛా! సంతోషపడాల్సిన సమయంలో కన్నీళ్ళేమిటి శోభా! తప్పు కదూ!"

చాలా ప్రేమగా పలికిన రావుగారి గొంతులోని మార్దవం శోభాదేవిని వివశను చేయడంతో అలాగే ఆయన భుజం మీదకు తల ఆనించి "యివ్వాళ నుంచీ కొద్దిగా నడవడానికి ప్రయత్నించమన్నారు డాక్టర్! మెట్లుమట్టుకు ఎక్కడం దిగటం చెయ్యొద్దన్నారు. ఎయిర్‌పోర్ట్‌కు రాలేకపోయినా బాల్కనీలో నిలబడి దినేష్ రావడం చూడొచ్చు" అంటున్న శోభాదేవి ఎదురుగా కనిపించిన హర్షను చూసి సిగ్గుపడి రావుగారికి దూరంగా జరిగింది. అప్పుడే వెనక్కు తిరిగి చూసిన రావుగారు—

"హర్షా! మీ ఆంటీకి ఇవ్వాళ డబుల్ డోస్ కాఫీ కావాలి. మరో కప్పు తీసుకురా!" అన్నారు నవ్వుతూ.

మెల్లగా నవ్వుతూ క్రిందకు పరుగెత్తింది హర్ష.

"అరే నాకు రెండు కప్పులెందుకు?" అంటున్న శోభాదేవి ముఖాన్ని దగ్గరకు తీసుకుంటూ "ఎందుకో చెప్పనా! ఇందుకు" అంటూ శోభాదేవి నుదుట ముద్దు పెట్టుకున్నారు.

"ఛా! కొడుకు పెళ్ళీడుకొచ్చినా చిలిపితనం, అల్లరీ కొంచం కూడా తగ్గలేదు" అంది శోభాదేవి తెచ్చి పెట్టుకున్న కోపంతో.

ఇంతలో మరో కప్పు కాఫీ తీసుకొని హర్ష రావడం చూసి, "ఆఁ హర్షా! ఇలా కూర్చో" అంటూ దగ్గరకు ఛైర్ లాగారు రావుగారు.

బెరుగ్గా వచ్చి కూర్చున్న హర్షవైపు ఆప్యాయంగా చూస్తూ "హర్షా! ఆ కాఫీ నువ్వు త్రాగు. రేపు దినేష్ వస్తాడు. ఈ రోజంతా మనం సరదాగా గడపాలి. అందుకే యివ్వాళ నేను ఆఫీసుకు కూడా వెళ్ళడం లేదు" అంటున్న రావుగారి వైపు సంభ్రమంగా చూసింది శోభాదేవి.

"ఫర్వాలేదే! ఇన్ని సంవత్సరాల తర్వాత మొట్టమొదటిసారి మీ అంతట మీరు ఆఫీసు మానేస్తున్నారంటే విశేషమే. దినేష్, హర్షా మీలో చాలా మార్పు తేగలిగారని చెప్పొచ్చన్న మాట."

ఓ క్షణం రావుగారి ముఖం వివర్ణమైంది. హర్ష నవ్వుతూ కాఫీ సిప్ చేస్తున్నదల్లా శోభాదేవి మాటలు విని వులిక్కి పడింది. కాఫీ మీద వంపుకుంది.

"అరె! కాఫీ పోసుకున్నావు. బట్టలు పాడౌతాయి. ముందు వెళ్ళి ఓణీ అంతవరకూ తడుపుకురా!" అంటూ నవ్వుతూ మాట్లాడుతున్న శోభాదేవి వైపు రావుగారివైపూ చూస్తూ లేచి కప్పు పట్టుకొని తొందరగా క్రిందకు వెళ్ళిపోయింది హర్ష.

ఆ రోజంతా రావుగారు చాలా ఆనందంగా వున్నారు. హర్ష తండ్రిని పిలిచి అతనితోపాటు కులాసాగా కబుర్లు చెబుతూ భోజనం చేశారు. మళ్ళీ యింట్లోకి చైతన్యం వచ్చినట్లుగా వుంది. హర్ష మనసు కొద్దిగా కుదుటపడింది. అంకుల్ తనను క్షమించారు. మామూలుగా మాట్లాడుతున్నారు అంతే చాలు. తృప్తిగా ఆంటీతో కూర్చుని కబుర్లు చెప్పింది. కొంతసేపు చదరంగం ఆడారు. అంకుల్ ఆంటీ ఆడుతుంటే మధ్యలో కూర్చొని కొంతసేపు సలహా లిచ్చింది. రాత్రి భోజనాలు ముగ్గురూ పైనే కబుర్లు చెప్పుకుంటూ చేశారు. రాత్రి చాలా ప్రొద్దుపోయేంత వరకూ రావుగారు ఏవేవో కబుర్లు చెప్పి నవ్విస్తూనే వున్నారు వాళ్ళిద్దర్నీ. ఆఖరికి శోభాదేవి 'నాకు నిద్ర వస్తోంది' అన్న తర్వాత క్రిందకు దిగి వచ్చారు. ఎవరి గదిలోకి వాళ్ళు వెళ్ళిపోయారు.

టేబుల్ దగ్గర కూర్చొని పేపర్ పెన్నూ తీసుకుంటూన్న రావుగారి చేతులు సన్నగా కంపించాయి.

పుష్పరాగం ముగ్గు

ఈ ముగ్గు వేయడానికి మధ్యన 16 చుక్కలు 6 వరుసల్లో పెట్టుకోవాలి. తర్వాత 14 చుక్కలు 3 వరుసల్లో ఇరువైపులా పెట్టుకోవాలి. తర్వాత 12 చుక్కలు ఒక వరుస, 6 చుక్కలు ఒక వరుస ఇరువైపులా పెట్టుకోవాలి. ఆ తర్వాత చిత్రంలో చూపించినట్లుగా కలుపుకుంటూ వస్తే అందమైన ఈ ముగ్గు తయారవుతుంది.

—దాసరి శారద



"డియర్ శోభా!

దినేష్ వచ్చే సమయానికి నీకు నేను లేకుండా పోతున్నాను. నిన్న ఈ రోజంతా హాపీగా వుంచాను. రేపు ఎదుర్కోబోయే దుఃఖాన్ని తట్టుకోగలగాలి నువ్వు. నేను కనిపించకుండా పోయినంత మాత్రాన చచ్చిపోతాననుకోకు. నాకు నా ప్రాణం కంటే అధికమైన, నిన్ను సర్వదా సుమంగళిగా చూడటం యిష్టం. అందుకే నేను నీకు యిక జీవితంలో ముఖం చూపించకపోయినా నీ మనసులో నేనెప్పుడూ సజీవంగా వుంటాను. వుండాలి. యిదీ నా స్వార్థమే. కానీ యిలా నేను వెళ్లిపోవడానికి కారణమేమిటో చెప్పి నీ ముందు క్షమాపణలు అడిగే అర్హతా అధికారం కోల్పోయాను. కారణం అడక్కు.

శోభా! నా చివరి కోరిక. హర్షను దినేష్‌కు చేసుకోడానికి వీల్లేదు. అది నాకిష్టం లేదు. ఇది నేను చేస్తున్న పాపమని నువ్వనుకుంటే నన్ను క్షమించడానికి ప్రయత్నించు. తెలిసిచేసిన పాపానికి నేను శిక్ష తప్పక అనుభవిస్తాను. అయితే హర్ష వివాహానికి నువ్వు తప్పకుండా సాయం చేయాలి. పాతిక వేలు హర్ష పేర వ్రాసి బీరువాలో పెట్టాను. అది హర్షకు నా పెళ్ళి కానుక. ఇంత కంటే ఏమీ వ్రాయలేని వ్రాయలేకపోతున్న....

నీ....పిరికి.... వేణు"

"అనురాగం చిందిందా
అమాయకత,
అభిమానం కురిపించిందా
అణకువ
అతిలోక సౌందర్యం
ఆకర్షించింది.
అంతటితో పూరుకోక ...
ఆశలు రేపింది అల్లరిగా.
వయసుడిగే కాలంలో,
వసంతాన్ని చవి చూపించింది.
అప్రయత్నంగా దొరికిన
అవకాశం...............
నాదేవి వియోగ ఫలితం........
మనిషిగా నిలవ నివ్వలేదు
పశుత్వం నన్నావహించింది
ఆలస్యంగా మళ్ళీ మనిషి నయ్యాను
అంతరాత్మ ఘోషించింది!
తెలిసి చేసిన పాపానికి కక్షగా,
ఆమెకు దూరం కావడమే
చేసుకున్నాను శిక్షగా!"

[సమాప్తి]